# ప్రజాపక్షం

## జిల్లా అనుబంధం

హన్మకొండ, వరంగల్, జనగాం, మహబూబాబాద్, భూపాలపల్లి, ములుగు
మెదక్, సంగారెడ్డి, సిద్దిపేట

శనివారం 03 | జనవరి, 2026 | పేజీలు :08


## 2026 లేబర్ సెలవుల క్యాలెండర్ ఆవిష్కరణ



**ప్రజాపక్షం/హనుమకొండ టౌన్:** షాప్, షాపింగ్ మాల్ వర్కర్స్ యూనియన్ (ఎఐటియూసి అనుబంధం) హనుమకొండ జిల్లా సమితి ఆధ్వర్యంలో 2026 లేబర్ సెలవుల క్యాలెండర్‌ను పి.యన్. మూర్తి క్లాత్ స్టోర్ యజమాన్యం చేతుల మీదుగా ఆవిష్కరించారు.యూనియన్ నాయకులు, కార్మికులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఎఐటియూసి జిల్లా అధ్యక్షులు వేల్పుల సారంగపాణి యాదవ్ మాట్లాడుతూ లేబర్ శాఖ ప్రకటించిన వేతనంతో కూడిన సెలవులను అందరు కార్మికులు తప్పనిసరిగా సద్వినియోగం చేసుకోవాలని కోరారు.ఈ కార్యక్రమంలో గండు సత్యం, వేల్పుల వీరేశం, గట్టికొప్పుల శివ, పిండి అనీల్, నల్లనాగుల నవీన్ కుమార్, మద్దెల శ్రీనివాస్, కోమటి రమేష్, తలకోళ్ళ కుమార్, కోడం సారంగాపాణి, హరీష్, సతీష్, పిండి లక్ష్మణ్, మహిళా కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

## సిపిఐ శతాబ్ది భారీ బహిరంగ సభ

### సిపిఐ జిల్లా కార్యదర్శి బి.విజయసారధి
### సిపిఐరాష్ట్ర కంట్రోల్ కమిషన్ మాజీ సభ్యుడు టి.విశ్వేశ్వర్‌రావు



**ప్రజాపక్షం/తొర్రూరు :** ఈ నెల 18న ఖమ్మంలో జరిగే భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ శతాబ్ది బహిరంగ సభను విజయవంతం చేయాలని సిపిఐ జిల్లా కార్యదర్శి బి.విజయసారధి అన్నారు. శుక్రవారం పట్టణ కేంద్రంలోని లయన్స్ భవన్‌లో పేరబోయిన కిరణ్ అధ్యక్షతన భారత కమ్యూనిస్టు పారీసిపిఐ తొర్రూరు మండల కౌన్సిల్ సమావేశం నిర్వహించగా సిపిఐజిల్లా కార్యదర్శి బి.విజయసారధి, సిపిఐ రాష్ట్ర కంట్రోల్ కమిషన్ మాజీ సభ్యులు తమ్మెర విశ్వేశ్వర్‌రావు మాట్లాడుతూ 1925 డిసెంబర్ 26నసిపిఐపార్టీ కాన్పూర్‌లో ఆవిర్భవించిందని, నాటి నుండి నేటి వరకు అనేక ఉద్యమాలు, పోరాటాలు నిర్వహించి చట్టసభల్లో కార్మికుల, కర్షకుల, విద్యార్థులకు అనేక చట్టాలు చేసినటువంటి ఘనత సిపిఐ పార్టీకి ఉందన్నారు. బడుగు బలహీన వర్గాల కోసం నిరంతరం వారి హక్కుల కోసం పోరాడే పార్టీ సిపిఐ పార్టీ అని అన్నారు. ప్రత్యేక తెలంగాణ ఉద్యమంలో సిపిఐపార్టీది కీలకపాత్ర అని గుర్తు చేశారు. వంద సంవత్సరాల చరిత్ర కలిగిన ఏకైక పార్టీ సిపిఐఅని అన్నారు. ఈ ప్రాంతంలో దొరలకు వ్యతిరేకంగా పోరాడి ప్రజలకు అండగా ఉందన్నారు. కేంద్రం, రాష్ట్రంలో ప్రజా వ్యతిరేక విధానాలపై అనునిత్యం ఉద్యమిస్తూ ముందుకు పోతుందన్నారు.
ఖమ్మంలో జరిగే సిపిఐ బహిరంగ సభకు నలబై దేశాల నుండి ప్రతినిధులు హాజరవుతున్నారని చెప్పారు.
మతోన్మాద బిజెపికి వ్యతిరేకంగా రాబోవు బహిరంగ సభలో చర్చించి ఉద్యమిస్తామన్నారు. కేంద్ర హోం మంత్రి అమిత్‌షా ఉద్యమాలను ఆపాలని చూస్తున్నారని వారికి పతనం తప్పదన్నారు. ప్రజలంతా తిరగబడి వచ్చే ఎన్నికల్లో బిజెపిని గద్దె దించాలన్నారు. ఈ నెల 18న ఖమ్మంలో జరిగే భారీ బహిరంగ సభకు అందరూ అధిక సంఖ్యలో పాల్గొనేందుకు తొర్రూరు ప్రాంతం నుంచి సిపిఐశతాబ్ది సభకు వందలాదిగా తరలి రావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎఐటియుసి గౌరవ అధ్యక్షులు ఓమ బిక్షపతి, మండల కార్యదర్శి బందు మహేందర్, గూడెల్లి ఎల్లయ్య, బూరుగు యాదగిరి, మందపురి శ్యాంసుందర్, సైరెడ్డి నర్సింహారెడ్డి, డొనక యాకయ్య, కోటగిరి చైతన్య, బొల్లు వెంకన్న, పల్లె సైదులు తదితరులు పాల్గొన్నారు.

## రైతులకు అవసరమైన యూరియా నిల్వలు

### వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద



**ప్రజాపక్షం/ నర్సంపేట :** వరంగల్ జిల్లాలో రైతులకు అవసరమైన యూరియా నిల్వలు ఉన్నాయని, అవసరమైన ప్రతి రైతులకు యూరియాను అందిస్తామని వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద అన్నారు. శుక్రవారం ఉదయం నర్సంపేట మండలం లక్నేపల్లి గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన పిఎసిఎస్ ఎరువుల పంపిణీ కేంద్రాన్ని, అలాగే చెన్నారావుపేట మండలం లింగగిరి గ్రామంలోని ఎరువుల పంపిణీ కేంద్రాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా సొసైటీలో యూరియా నిల్వలు, యూరియా టోకెన్ల పంపిణీ విధానం, రైతులకు ఎరువుల పంపిణీ జరుగుతున్న తీరును కలెక్టర్ పరిశీలించారు. అక్కడున్న రైతుల సమస్యలను నేరుగా అడిగి తెలుసుకున్నారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ యూరియా పంపిణీ ప్రక్రియలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. రైతులు సౌకర్యంగా యూరియా పొందేందుకు ఎక్కువ సంఖ్యలో కౌంటర్లు ఏర్పాటు చేయాలని సూచించారు. ప్రతి రైతు తన పంట విస్తీర్ణం ఆధారంగా మాత్రమే ఎకరానికి ఒక్క బ్యాగ్ యూరియా తీసుకోవాలని తెలిపారు. ప్రస్తుతం మొక్కజొన్న పంట వేసిన రైతులు మాత్రమే యూరియా తీసుకోవాలన్నారు. నర్సంపేట మండలం లక్నేపల్లి గ్రామంలో 430 బస్తాలు, రామవరం గ్రామంలో 420 బస్తాలు, భాంజీపేటలో 170 బస్తాలు, చంద్రాయపల్లిలో 170 బస్తాలు, జగన్నాథపల్లిలో 80 బస్తాలు పంపిణీ చేసినట్లు తెలిపారు. చెన్నారావుపేట మండలం లింగగిరి గ్రామంలో 444 బస్తాలు, జల్లి గ్రామంలో 444 బస్తాలు, అక్కలచెడ్ గ్రామంలో 444 బస్తాల యూరియా పంపిణీ చేపట్టినట్లు తెలిపారు. గోదాంలో ప్రస్తుతం 5,500 మెట్రిక్ టన్నుల యూరియా నిల్వలు అందుబాటులో ఉన్నాయని, జిల్లాలోని రైతుల అవసరాలను దృష్టిలో ఉంచుకొని అర్హులైన ప్రతి రైతుకు యూరియా అందేలా పంపిణీ కొనసాగించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి అనురాధ, జిల్లా సహకార అధికారి నీరజ, వ్యవసాయ శాఖ అధికారులు పాల్గొన్నారు.

## నెల రోజుల పాటు ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన

### ట్రాఫిక్ నిబంధనలు పాటించండి.. సురక్షిత ప్రయాణం చేయండి : జిల్లా ఎస్ పరితోష్ ఫంకజ్



**ప్రజాపక్షం / సంగారెడ్డి:** జాతీయ రోడ్డు భద్రత మాసం 2026 ను పురస్కరించుకొని జనవరి 1 నుండి 31 వ తేది వరకు నెల రోజుల పాటు జిల్లా వ్యాప్తంగా ట్రాపిక్ నిబంధనలపై వివిధ రకాల అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందని జిల్లా ఎస్‌పిపరితోష్ ఫంకజ్ తెలిపారు. ప్రతి వాహనదారుడు హెల్మెట్ ,సీట్ బెల్ట్ తప్పనిసరిగా ధరించాలని విదిగా ట్రాపిక్ నిబందనలు పాటిస్తూ సురక్షితంగా ప్రయాణం చేయాలని ఎస్పీ సూచించారు. జిల్లా ఎస్‌పిఆదేశాల మేరకు పటాన్‌చెరు డిఎస్పీ ప్రభాకర్ ఇన్పెపెక్టర్ వినాయక్ రెడ్డి ,ట్రాపిక్ ఇన్స్‌పెక్టర్ లాలూ నాయక్, ఆర్‌టిఎ అదికారులతో పాటు ఇతర శాఖల సమన్వయంతో పటాన్‌చెరు సబ్ డివిజన్ పరిధిలో జాతీయ రహదారి 65 తరుచూ ప్రమాదాలు జరిగే స్పాట్లను సందర్శించి ప్రమాదాల నివారణకు అవసరమైన సైన్ బోర్డులు ఏర్పాటు చేయడం రాంబుల్ స్రీప్స్ వేయించేందుకు చర్యలు చేపట్టడం జరుగుతుందని తెలిపారు. అదే విధంగా జోగిపేట పోలీసు స్టేషన్ పరిదిలో ఎస్‌ఐ పాండు సిబ్బందితో కలిసి వాహనదారులకు రోడ్డు భద్రతా ప్రతిజ్ఞ చేయించి ట్రాపిక్ నిబందనలు పాటించేలా అవగాహన కల్పించడం జరిగింది. ఇదే విధంగా నెల రోజుల పాటు వినూత్న కార్యక్రమాలను నిర్వహిస్తు రోడ్డు భద్రతా పై వాహనాదారులకు అవగాహన కార్యక్రమాలను నిర్వహించడం జరిగుతుందని తెలిపారు.

## అభివృద్ధిలో జిల్లాను ఆదర్శంగా నిలపాలి

### అభివృద్ధికి అధికారులు సమన్వయంతో పని చేయాలి:జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ



**ప్రజాపక్షం/భూపాలపల్లి :** రాష్ట్రంలో జిల్లా అభివృద్ధిలో ఆదర్శంగా నిలవాలంటే అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పని చేయాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ తెలిపారు. గురువారం ఐడిఓసి కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో అన్ని శాఖల జిల్లా అధికారులు, తెలంగాణ నాన్ గెజిటెడ్ అధికారులు, నాలుగో తరగతి సిబ్బంది, వివిధ ఉద్యోగ సంఘాల నాయకులు కలెక్టర్‌కు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రతి అధికారి స్పష్టమైన లక్ష్యాలను నిర్దేశించుకుని అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని, ప్రజలతో మమేకమై వారి సమస్యల పరిష్కారానికి చొరవ చూపాలని సూచించారు. అన్ని శాఖలు పరస్పర సమన్వయంతో పనిచేసినప్పుడే ప్రజలకు మెరుగైన సేవలు అందించగలమని ఆయన స్పష్టం చేశారు. నూతన సంవత్సర శుభాకాంక్షల సందర్భంగా బొకేలు, పుష్పగుచ్చాలకన్నా విద్యార్థులకు ఉపయోగపడే నోట్ పుస్తకాలు, పెన్నులు, పెన్సిళ్లు, పరీక్ష ప్యాడ్లు అందించాలన్న తన పిలుపుకు స్పందించిన వారందరినీ కలెక్టర్ అభినందించారు. ఈ ఆలోచన సామాజిక బాధ్యతను ప్రతిబింబించడమే కాకుండా విద్యార్థుల భవిష్యత్తుకు తోడ్పడుతుందని తెలిపారు. సంకల్పం, సేవా భావం, సమన్వయం ఇవే మన జిల్లా పురోగతికి మూల స్తంభాలని పేర్కొంటూ, నూతన సంవత్సరం జిల్లా అభివృద్ధికి మైలురాయిగా నిలవాలని ఆకాంక్షించారు.

# సమ్మక్క సారక్క టెండరు

**ప్రజాపక్షం/ వేలేరు :** త్వరలో జరుగబోయే సమ్మక్క,సారక్క జాతర సంధర్భంగా శుక్రవారం వేలేరు మండలంలోని పీచర గ్రామశివారులో మినిమేడారంగా పిలువబడుతున్న పీచర సమ్మక్క,సారక్క టెండరును చైర్మన్‌గా గొల్లెన రమేష్,వైస్‌చైర్మన్ సట్ల రవిందర్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్యఅథిధిగా సర్పంచ్ మరిజె అనితనర్సింగారావు,మాజీజెడ్‌పిటిసి కీర్తి వెంకటేశ్వర్లు త్వరలో జరుగబోయే మినిమేడారం జాతర టెండరు నిర్వహించగా బెల్లం (బంగారం)ఎడవెల్లి నవీన్ రూ.1,00000/ కొబ్బరికాయలు పోలు నాగరాజు రూ.7,0000/కోళ్లు (చికెన్)మాతంగి రాజేష్ రూ.1,300 00/ మద్యం శివరాత్రి వెంకటమల్లురూ. 3,250 00/లకు టెండర్లు దక్కించుకోగా మొత్తం రూ.6,25000/రూ,ఆదాయం రాగా ఇట్టి టెండరు 45 రోజులు గ్రామంలో నిర్వహించడం జరుగుతోంది కనుక గ్రామంలో ఎవ్వరైనా ఈటెండరుకు సంబందించిన నిబందనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు తప్పవని సమ్మక్క,సారక్క దేవస్థానం అభివృద్ధికి తోడ్పాటును అందించాలని కోరారు కార్యక్రమంలో మాజీచైర్మన్‌లు కొయ్యడ మహేందర్, ఎర్రగొల్ల ఎల్లయ్య,నిర్వహన కమిటీసభ్యులు,దేవస్థాన వ్యవస్థాపకులు జల్తారి కనుకయ్య,గ్రామస్తులు మారబోయిన రాజు,మాజీ కోఆప్షన్ సభ్యుడు జానీ,సమ్మక్క,సారక్క డైరెక్టర్లు గ్రామస్తులు పాల్గొన్నా రు.

# నాగారంలో నూతన కార్య వర్గం ఏకగ్రీవ ఎన్నిక

**ప్రజాపక్షం/పరకాల:** హన్మకొండ జిల్లా పరకాల మండలం నాగారంలో మాల సంఘం నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సంఘ సర్వసభ్య సమావేశంలో ఈ ఎంపిక ప్రక్రియ అత్యంత ఉత్సాహభరితంగా సాగింది. సంఘాభివృద్ధికి కట్టుబడి ఉండేలా పలువురు నాయకులను నూతన బాధ్యతలకు సభ్యులందరూ కలిసి ఏకగ్రీవంగా ఆమోదించారు. ఎన్నికైన నూతన కార్యవర్గ సభ్యులలో గౌరవ అధ్యక్షుడిగా మాడ లక్ష్మీ నారాయణ,అధ్యక్షుడిగా మద్దెల బాబు, ఉపాధ్యక్షుడిగా బండారి రాజమౌళి, బండారి మొగిలి,ప్రధాన కార్యదర్శిగా మాడ శివ రాజు,కోశాధికారిగా బండారి చంద్రమౌళి ,కార్యవర్గ సభ్యులుగా మద్దెల కిరణ్, మద్దెల హరికృష్ణ, మేకల సమ్మయ్య ఉన్నారు.ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడు మద్దెల బాబు మాట్లాడుతూ.. తనపై నమ్మకంతో బాధ్యతలు అప్పగించిన సభ్యులందరికీ కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సంఘ సభ్యులు, పాత కమిటీ ప్రతినిధులు పాల్గొని నూతన కార్యవర్గానికి ఘనంగా శుభాకాంక్షలు తెలిపారు.

# రోటరీ క్లబ్ రూ. 3 లక్షల విరాళం

**ప్రజాపక్షం/కమలాపూర్;**కమలాపూర్ మండల కేంద్రంలోని శ్రీ సరస్వతి శిశు మందిర్ పాఠశాల అభివృద్ధి పనుల కొరకు రోటరీ క్లబ్ ఆఫ్ ఆశ్రయ్ వరంగల్ తోట వైద్యనాథ్ కృషి పట్టుదలతో ప్రహరీ గోడ నిర్మాణం, గేట్ నిర్మాణం కోసం రూ. 3 లక్షల వ్యయంతో ఏర్పాటు చేశారని, శ్రీ సరస్వతి శిశు మందిర్ పాఠశాల ప్రధానాచార్యులు గుడికందుల స్వరూపారాణి తెలిపారు. ఈ నిర్మాణానికి వాసవి క్లబ్‌కుగాని దొడ్డ రమేష్, వాణి లకు కానీ ఎలాంటి సంబంధం లేదని, అసత్యపు ప్రచారం చేయడాన్ని ఖండిస్తున్నామని తెలిపారు. గౌరవ అధ్యక్షుడు , కార్యదర్శి , కోశాధికారి పాల్గొన్నారు.

# రాజవరం సర్పంచ్ ఏ పార్టీ వైపు మొగ్గు చూపుతారో..?



**ప్రజాపక్షం/స్టేషన్ ఘన్ పూర్ :** చిల్పూర్ మండలం రాజవరం గ్రామంలో చర్చనీయంగా మారిన (ఇండిపెండెంట్) స్వతంత్రముగా గెలిచిన సర్పంచ్ అభ్యర్థి రాజు మండలంలో ఏ పార్టీ వైపు మొగ్గుతాడో ప్రజల్లో ఆసక్తికర చర్చ సాగుతున్నది. డిసెంబర్ 11న మొదటి విడత సర్పంచ్ ఎన్నికలో జనగాం జిల్లా చిల్పూర్ మండలం రాజవరం గ్రామంలో సర్పంచ్ ఎన్నికలు అంచనాలకు భిన్నంగా జరిగాయి. ప్రధాన పార్టీలైన కాంగ్రెస్, బీఆర్ ఎస్ ల మధ్య పోటీ ఉత్కంఠ రేపుతుందని భావించగా, గ్రామస్తులు పార్టీల దాటికి బ్రేక్ పెట్టారు. స్వతంత్ర అభ్యర్థి మోటం రాజును గెలిపిస్తూ కొత్త రాజకీయ సందేశం ఇచ్చారు. ప్రచారం మొదలైన దగ్గర నుంచే మోటం రాజు గ్రామస్తులతో మమేకమవుతూ, సమస్యలు తెలుసుకుంటూ ముందుకు సాగారు. పార్టీల అభ్యర్థులు బలంగా మైదానంలోకి దిగినా మోటం రాజు పాదయాత్ర, ఇంటింటి ప్రచారం గ్రామంలో చర్చనీయాంశమైంది. చివరకు ఓట్ల లెక్కింపు ముగిసే సరికి మోటం రాజు క్లియర్ మెజారిటీతో ముందంజలో నిలిచి సర్పంచ్ కిరీటం దక్కించుకున్నారు. విజయం సాధించడం ఈ సారి ప్రత్యేకతగా నిలిచింది. ఎన్నికల తర్వాత గ్రామంలో ఒక్క ప్రశ్నే వినిపిస్తోంది. మోటం రాజు ఇప్పుడు ఏ పార్టీ వైపు వెళ్తారు.?...ఏ పార్టీకి దూరంగానే పోటీ చేసినప్పటికీ ఆయనకు మూడు పార్టీల నుంచి ఆహ్వానాలు పలుకుతుండగా ఏ పార్టీకి అవకాశం ఇస్తాడో... అని రాజకీయ వర్గాల్లో చర్చ నడుస్తోంది. గ్రామాభివృద్ధిని కేంద్ర బిందువుగా చేసుకుంటానని, ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టుకుంటానని మోటం రాజు తెలిపారు. రాజవరంలో సర్పంచ్ ఎన్నికల ఫలితం ఇప్పుడు మండల రాజకీయాల్లో హార్ట్ టాపిక్ గా మారింది.

# విద్యార్థుల అభ్యున్నతే లక్ష్యంగా స్కాలర్‌షిప్



**ప్రజాపక్షం/మహాదేవపూర్;**విద్యార్థుల అభ్యున్నతే లక్ష్యంగా మెరిట్ విద్యార్థులకు స్కాలర్‌షిప్ అందజేయనున్నట్లు గుడ్ మార్నింగ్ గ్రామర్ హైస్కూల్ చైర్మెన్ ఎంఎం శశి పేర్కొన్నారు.శుక్రవారం మండలకేంద్రంలోని గుడ్‌మార్నింగ్ గ్రామర్ హైస్కూల్ ఆధ్వర్యంలో వివిధ శాఖల అదికారులు,పాత్రికేయులకు 2026 నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపి డైరీలను అందజేసారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల అభ్యున్నతికి పాఠశాల అధ్వర్యంలో అనేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని ఇందులో భాగంగా విద్యార్థులకు లీడ్ భాగస్వామ్యంతో స్కాలర్షిప్ అర్హత టెస్టులు నిర్వహిస్తున్నామని ఇందులో పాల్గొనే విద్యార్థుల మెరిట్ ఆధారంగా స్కాలర్షిప్ అందజేయనున్నామని అన్నారు.దీంతో విద్యార్థుల్లో పోటీతత్వం పెరిగి ఉన్నతంగా ఎదిగే అవకాశాలు ఉంటాయని అన్నారు.ప్రజలకు నిస్వార్థంగా సేవలందించే ప్రభుత్వ విభాగా పట్ల కృతజ్ఞతాభావంతో డైరీలను అందజేసామని ఇలాంటి కార్యక్రమాలు విద్యా సంస్థలు,ప్రభుత్వ కార్యాలయాలు పరస్పర సహకారంతో సమాజ అభివృద్ధికి ఎంతో అవసరమని అన్నారు.భవిశ్యత్తులో ఇలాంటి సామాజిక కార్యక్రమాలు చేపడుతూ విద్యార్థుల్లో బాద్యతా,కృతజ్ఞతా భావం పెంపొందించడానికి ఉపయోగపడతాయని అన్నారు.

# సింగరేణిలో మితిమీరిన రాజకీయ జోక్యం



**ప్రజాపక్షం/భూపాలపల్లి :**సింగరేణిలో గతం కంటే రాజకీయ జోక్యం మితిమీరి పోయిందని, కాంగ్రెస్ పార్టీ నాయకుల అనుచరులకి సింగరేణి టెండర్లు ఇస్తున్నారని భూపాలపల్లి మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి, టీబీజీకేఎస్ అధ్యక్షుడు మిరియాల రాజిరెడ్డి లు ఆరోపించారు. భూపాలపల్లి జిల్లా కేంద్రం లోని బిఆర్ఎస్ పార్టీ జిల్లా కార్యాలయంలి మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకట రమణా రెడ్డి, టీబీజీకేఎస్ అధ్యక్షుడు మిర్యాల రాజీరెడ్డిల సమక్షంలో హెచ్ఎంఎస్, ఐఎన్‌టియుసి సంఘాల నాయ కులు బిఆర్ఎస్ పార్టీ అనుబంధం సంఘం తెలంగాణ బొగ్గు గాని కార్మిక సంఘంలో చేరారు. వారికి మాజీ ఎమ్మెల్యే రమణారెడ్డి వారికి హెచ్ఎంఎస్ వైస్ ప్రెసిడెంట్ బత్తిని సుదర్శన్, హెచ్ఎంఎస్ ఫిట్ సెక్రెటరీ అనిల్ రెడ్డి, ఐఎన్‌టీ యూసీ ఫిట్ సెక్రెటరీ సాంబయ్యతో పాటు మొత్తం 30 మంది హెచ్ఎంఎస్, ఐఎన్‌టీయూసీ నాయకులకు టిఆర్ఎస్ పార్టీ కండువా కప్పి టిబీజీకేఎస్ లోకి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, సింగరేణిలో వెంటనే గతం కంటే మితిమీరిన రాజకీయ జోక్యం ఎక్కువైందని, కార్మికుల హక్కు లను కాపాడ డంలో టిబీజీ కేఎస్ ముందుంటుందని స్పష్టం చేశారు. కార్మికుల నమ్మకాన్ని పొందిన సంఘమే రాబోయే రోజుల్లో బలంగా నిలుస్తుందని అన్నారు. సింగరేణిలో యూనియన్ ఎన్నికలు ఆలస్యం కావడం వల్ల కార్మికుల్లో అసంతృప్తి పెరుగుతోందని అన్నారు. టీబీజీకేఎస్ ద్వారానే కార్మిక సమస్యలు పరిష్కరిస్తాయని టీబీజీకేఎస్ లో వారు చేరడం జరిగిందని తెలిపారు. రాబోయే మున్సిపల్ ఎన్నికల్లో బిఆర్ఎస్ గెలిచే విధంగా పనిచేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో టీబీజీకేఎస్ నాయకులు బడితల సమ్మయ్య, పలువురు కార్మిక నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ప్రమాదాల నివారణ ప్రతి ఒక్కరి బాధ్యత



**ప్రజాపక్షం/భూపాలపల్లి :**రోడ్డు ప్రమాదాల నివారణ ప్రతి ఒక్కరి బాధ్యత అని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ అన్నారు. జాతీయ రోడ్డు భద్రత మాసోత్సవాన్ని పురస్కరించుకొని జిల్లా రవాణా శాఖ ఆధ్వర్యంలో రూపొందించిన రోడ్డు భద్రత మహోత్సవాల వాల్ పోస్టర్, కరపత్రికలను జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ గురువారం ఐడివైసి కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, రోడ్డు ప్రమాదాల నివారణ ప్రతి ఒక్కరి బాధ్యత అని స్పష్టం చేశారు. రోడ్డు భద్రతను సరదాగా తీసుకోవద్దని, చిన్న నిర్లక్ష్యం కూడా ప్రాణాంతక ప్రమాదాలకు దారితీస్తుందని హెచ్చరించారు. ముఖ్యంగా అతివేగం, మద్యం సేవించి వాహనాలు నడపడం, ట్రాఫిక్ నిబంధనలను ఉల్లంఘించడం వంటి చర్యలు ప్రమాదాలకు ప్రధాన కారణాలు అవుతున్నాయని పేర్కొన్నారు. వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్, సీట్‌బెల్ట్ వినియోగం, వేగ నియంత్రణ, రహదారి సంకేతాల పాటన వంటి భద్రతా నియమాలను అనుసరించాలని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం జనవరి మాసం మొత్తాన్ని జాతీయ రోడ్డు భద్రతా మాసోత్సవాలు నిర్వహిస్తోందని తెలిపారు. రోడ్డు భద్రతపై ప్రజల్లో అవగాహన పెంపొందించేందుకు ఇలాంటి కార్యక్రమాలు ఎంతో అవసరమని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్టీఓ సంధాని మహ్మద్, ఎక్సైజ్ ఈఎస్ శ్రీనివాస్, ఇరిగేషన్ ఈ ఈ ప్రసాద్, ఉద్యాన అధికారి సునీల్, యువజన సర్వీసులు శాఖ అధికారి రఘు, ట్రైని డిప్యూటీ కలెక్టర్ నవీన్ రెడ్డి, రవాణా శాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# గాంధీ నగర్‌లో మెగా క్రికెట్ టోర్నీ కరపత్రం ఆవిష్కరణ



**ప్రజాపక్షం/భీమదేవరపల్లి:** గాంధీనగర్ గ్రామంలో ఈనెల 4 వ తేదీ ఆదివారం రోజు మెగా క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించడం జరుగుతుందని నిర్వాహకులు తెలిపారు. గురువారం నాడు గాంధీనగర్ సర్పంచ్ లక్ష్మి రెడ్డి టోర్నమెంట్ కు సంబంధించిన కరపత్రాన్ని ఆవిష్కరించడం జరిగింది. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ నేడు యువత ఆత్మస్థైర్యం కోల్పోయి తీవ్ర మానసిక ఒత్తిడికి గురై డ్రగ్స్ ఆన్‌లైన్ గేమింగ్ మద్యంకు బానిసై ఆత్మహత్య చేసుకుంటున్నవారు ఒకవైపు అతివేగంతో వాహనాలు నడిపి రోడ్డు ప్రమాదాల్లో మరణించి వారి కుటుంబాల్లో తీవ్ర నిరాశను దుఃఖాన్ని మిగుల్చుతున్న వారు మరోవైపు కాబట్టి యువతలో క్రీడల పట్ల ఆసక్తిని పెంచి వారిలో మనోధైర్యాన్ని క్రీడా స్ఫూర్తిని నింపాలన ఉద్దేశంతో నిర్వహిస్తున్నదే ఈ క్రికెట్ టోర్నమెంట్, యువతలో మార్పు కోసం చేసే ఈ ప్రయత్నంలో యువత భాగస్వాములు కావాలని కోరారు. గాంధీనగర్ సర్పంచ్ కేతోరి లక్ష్మి రెడ్డి నిర్వాహకులు సీనియర్ క్రీడాకారులు వార్డు సభ్యులు తాళ్లపల్లి కుమారస్వామి మాజీ వార్డు సభ్యులు తాళ్లపల్లి రమేష్ తాళ్లపల్లి అశోక్ నిర్వహణ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

# పిట్టలపల్లి గ్రామ ప్రజలకు అండగా ఉంటా: ఏసిపి

**ప్రజాపక్షం/కమలాపూర్:**కమలాపూర్ మండలం దేశరాజుపల్లి గ్రామ పరిధీలోని అవాసయోగ్యానికి దూరంగా ఉన్న పిట్టలపల్లి గ్రామ ప్రజలకు అండగా ఉంటానని కాజీపేట ఏసిపి పింగిలి ప్రశాంత్ రెడ్డి అన్నారు. కమలాపూర్ పోలీస్ స్టేషన్ సిబ్బందితో కలిసి ట్రాక్టర్ లో చేరుకొని అక్కడ నివసిస్తున్న ప్రజలతో మమేకమై వారి యొక్క యోగక్షేమాలు తెలుసుకోని వారితో కలిసి నూతన సంవత్సర వేడుకల్లో భాగంగా కేక్ కట్ చేసి సహపంక్తి భోజనం చేసి వారికి ఉన్న ముఖ్య సమస్యలైనా రోడ్డు సౌకర్యం సరిగా లేకపోవడం, వైద్య సదుపాయం, అదే విధంగా పాఠశాల నిర్మాణం విషయంలో సహాయం చేస్తామని పోలీస్ వారి తరపున భరోసా ఇవ్వడం జరిగింది. దీంతో ఆ పల్లె ప్రజల కళ్ళల్లో ఎంతో ఆనందం పొంగిపోయింది. ఈ కార్యక్రమంలో ఏసిపి వెంట కమలాపూర్ ఇన్స్పెక్టర్ హరికృష్ణ, సబ్ ఇన్స్పెక్టర్ మధు, పోలీస్ సిబ్బంది, గ్రామస్థులు పాల్గొన్నారు.

# రాష్ట్ర స్థాయి పోటీలకు మోడల్ స్కూల్ విద్యార్థులు

**ప్రజాపక్షం/జఫర్‌గడ్:** 11వ తెలంగాణ రాష్ట్ర స్థాయి క్రాస్ కంట్రీ అథ్లెటిక్స్ పోటీలకు తమ పాఠశాల విద్యార్థులు ఎంపికవడం ఎంతో సంతోషంగా ఉందని ప్రిన్సిపాల్ డాక్టర్. కె.శ్రీకాంత్ తెలిపారు. గత నెల జనగామ జిల్లాకేంద్రంలోని ధర్మకంచ మినీ స్టేడియంలో జరిగిన క్రాస్ కంట్రీ అథ్లెటిక్స్ సెలక్షన్స్‌లో జఫర్‌గడ్ విద్యార్థులు టి.విజయ్, టి.చరణ్, సాయితేజలు ప్రతిభ చూపి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారని, ఈనెల 3,4 తేదిలలో హైద్రాబాద్‌లోలోని గచ్చిబౌలి స్టేడియంలో జరగబోయే రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ పోటీలలో పాల్గొననున్నారని తెలిపారు. ఉపాధ్యాయుని, ఉపాధ్యాయులు,తదితరులు విద్యార్థులను అభినందించారు.

# నూతన క్యాలెండర్ ఆవిష్కరణ



**ప్రజాపక్షం/జఫర్‌గడ్:** పిఆర్‌టియుసిఎస్ మండల శాఖ ఆధ్వర్యంలో జఫర్‌గడ్‌లోని జెడ్‌పిహెచ్‌ఎస్ పాఠశాలలో వాల్ క్యాలెండర్‌ను ఎంఈవో రఘునందన్‌రెడ్డి చేతుల మీదుగాఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అందరికి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలుపుతూ సుఖసంతోషాలతో ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మండలశాఖ అధ్యక్షులు కే.సీతారామయ్య, ప్రధాన కార్యదర్శి రామారావు, ఇంచార్జీ ప్రధానోపాధ్యాయులు శ్రవణ్, వెంకటేశ్వర్లు, భాస్కర్, సదానందం, ఖలీల్‌పాషా, పెద్దిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## ఉప సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడిగా లక్ష్మయ్య

**ప్రజాపక్షం/నడికూడ :** నడికూడ మండలంలో 9 గ్రామాల ఉప సర్పంచ్ లు ఏకమై నడికూడ మండల ఉప సర్పంచ్ ఫోరం ఏర్పాటు చేసి సర్వాపూర్ గ్రామ ఉప సర్పంచ్ దండు లక్ష్మయ్యను ఉప సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా దండు లక్ష్మయ్య మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధి, ఉప సర్పంచ్ సమస్యల పరిష్కార లక్ష్యంగా ఈ ఫోరంను ఏర్పాటు చేసినట్లు తెలిపారు.ఫోరం కమిటీలో ప్రధాన కార్యదర్శి పల్లె వెంకన్న,ఉపాధ్యక్షులు యారా ప్రవీణ్,కోశాధికారి ఈర్ల లక్ష్మి ,కార్యదర్శి కనకాల వినయ్,కమిటీ సభ్యులు సిహెచ్ సురేందర్ రెడ్డి,ముక్కెర రాజు,బొట్ల శ్యామలను ఎన్నుకున్నట్లు తెలిపారు.

## తెలంగాణ రాష్ట్ర జట్టుకు కోచ్‌గా లక్ష్మీనారాయణ

**ప్రజాపక్షం/కేయూ క్యాంపస్ :** రాజస్థాన్ లోని చితోర్ ఘర్ లో ఈనెల ఐదు నుంచి పదో తేదీ వరకు జరిగే 14 ఏళ్ల లోపు బాలుర తెలంగాణ రాష్ట్ర జట్టుకు వంగేటి లక్ష్మీ నారాయణ కోచ్ గా వ్యవహరించనున్నారు. ఈ మేరకు పాఠశాల విద్యా డైరెక్టర్ కార్యాలయం నుంచి పాఠశాల క్రీడల సమాఖ్య కార్యదర్శి ఉషారాణి ఉత్తర్వులు జారీ చేశారు. లక్ష్మీ నారాయణ ప్రస్తుతం దామెర మండలం ఊరుగొండ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయుడుగా పనిచేస్తున్నారు.వివిధ పాఠశాలల్లో ఆయన నేతృత్వంలో పలువురు జాతీయస్థాయి క్రీడాకారులుగా ఎదిగారు. జాతీయ స్థాయి పోటీలలో పాల్గొనే రాష్ట్ర జట్టుకు ఆయన శిక్షకుడు గా వ్యవహరించడం పట్ల ఊరుగొండ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వై సత్యనారాయణ ఉపాధ్యాయ బృందం ఆయనను అభినందించారు. 20 మంది విద్యార్థుల బృందంతో ఆయన రాజస్థాన్ వెళ్లనున్నారు.

## మండల సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడిగా చల్ల రాకేష్ రెడ్డి

**ప్రజా పక్షం/హసన్ పర్తి:** మండల పరిధిలోని 15గ్రామ పంచాయితీల మండల సర్పంచుల పోరం అధ్యక్షులుగా చల్ల రాకేష్ రెడ్డి ఎన్నిక య్యారు. వివరాల్లోకి వెళితే వర్ధన్నపేట ఎమ్మెల్యే విశ్రాంత ఐపీఎస్ అధికారి కె.ఆర్ నాగరాజ్ ఆదేశాల మేరకు మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పోరెడ్డి. మహేందర్ రెడ్డి, జిల్లా బ్లాక్ కాంగ్రెస్అధ్యక్షులు,ఆత్మకూర్ మార్కెట్ వైస్ చైర్మన్ తంగళ్ళపల్లి తిరుపతి ఆధ్వర్యంలో బుధవారం మండల పరిధిలోని 15 గ్రామ పంచాయతీల మండల ఫోరం కమిటీని ఎన్నుకోవడం జరిగింది. సర్పంచుల పోరంఅధ్యక్షులుగా గుంటూరు పల్లి గ్రామపంచాయతీసర్పంచ్ చల్ల రాకేష్ రెడ్డి, ఉపాధ్యక్షులుగా అర్వపల్లి గ్రామపంచాయతీ సర్పంచ్ అంబాల ప్రభాకర్ గౌడ్ ,కార్యదర్శిగా అనంతసాగర్ గ్రామపంచాయతీ సర్పంచ్ రామంచ వెన్నెల లను ఎన్నుకోవడం జరిగింది. ఈ సందర్భంగా ఫోరం అధ్యక్షులు రాకేష్ రెడ్డి మాట్లాడుతూ గ్రామ పంచాయితీలకు రావలసిన నిధులను ప్రస్తుత ప్రభుత్వం ద్వారా తీసుకురావడానికి శాయ శక్తుల కృషి చేస్తానని అన్నారు .మండల ఫోరంఅధ్యక్షుడిగా ఎన్నికకు సహకరించిన పెద్దలు శాసనసభ్యుడు ఎమ్మెల్యే నాగరాజుకు మండల అధ్యక్షులుపోరెడ్డి మహేందర్ రెడ్డి కి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు, ఆత్మకూర్ వైస్ చైర్మన్ తంగళ్ళపల్లి తిరుపతికి 15 గ్రామ పంచాయతీల సర్పంచులకు హృదయపూర్వక వందనాలు తెలిపారు.

## మాజీ ఎమ్మెల్యే అసత్య ఆరోపణలు మానుకోవాలి

**ప్రజాపక్షం/ నర్సంపేట :** ఇకనైనా అసత్య ఆరోపణలు మానుకోవాలని, ఎమ్మెల్యే దొంతిపై దుష్ప్రచారం తగదని, కమీషన్లు తీసుకుని సంస్కృతి మీదని, బహిరంగ విచారణకు సిద్ధమని మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డిని టిపిసిసి సభ్యులు పెండెం రామానందని విమర్శించారు. నర్సంపేట మున్సిపాలిటీకి చెందిన 25వ వార్డులో దాదాపు రూ. 50 లక్షలతో చేపట్టుతున్న సిసి రోడ్లు, సైడ్ కాలువల నిర్మాణ పనులను ప్రారంభించారు. అనంతరం ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ నర్సంపేట నియోజకవర్గంలో గత రెండు సంవత్సరాలుగా జరుగుతున్న అభివృద్ధి పనులను మరిచి కేవలం రాజకీయ పబ్బం గడుపుకోవడానికే ప్రస్తుత ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి పై మాజీ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి అసత్య ఆరోపణలు చేస్తున్నారని విమర్శించారు. నియోజకవర్గంలో విద్యా వ్యవస్థను మరింత మెరుగుపరిచేందుకు శాసనసభ్యులు దొంతి సహకారంతో 200 కోట్లతో ఇంటిగ్రేటెడ్ స్కూల్, మెడికల్ కాలేజ్ నిర్మాణం కొరకు 150 కోట్లు, నర్సింగ్ కాలేజ్ నిర్మాణం కొరకు 25 కోట్లు, 40 కోట్లతో పంచాయతీ రాజ్ శాఖ నుండి అన్ని మండలాల్లో బీటీ రోడ్ల నిర్మాణాలు, ఆర్అండబి శాఖ నుండి 12,85 కోట్లతో జల్లి నుండి లింగగిరి వరకు, 17 కోట్లతో చెన్నారావుపేట నుండి కేసముద్రం వరకు, 16 కోట్లతో నెక్కొండ నుండి సంగెం వరకు డబల్ రోడ్ల నిర్మాణం, నర్సంపేట నుండి వరంగల్ వరకు ఫోర్ లైన్ రోడ్, అదే విధంగా నియోజకవర్గంలో అనేక డబల్ రోడ్లు, ఎస్సీ సబ్ ప్లాన్ నిధుల ద్వారా 15 కోట్లతో అన్ని గ్రామాల్లో సీసీ రోడ్లు మరియు సైడ్ కాలువల నిర్మాణాలు చేపడుతున్నామని, నర్సంపేట మున్సిపాలిటీలో 30కోట్లతో నిధులతో సీసీ రోడ్లు సైడ్ కాలువల నిర్మాణాలు చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో నర్సంపేట పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు బత్తిని రాజేందర్, మాజీ మార్కెట్ చైర్మన్ ఎర్ర యాకుబ్ రెడ్డి, సీనియర్ నాయకులు కాట ప్రభాకర్, నర్సంపేట నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు తుమ్మలపెల్లి సందీప్, నర్సంపేట పట్టణ కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్లు మాదాసి రవి, పంబి వంశీకృష్ణ, మాజీ కౌన్సిలర్ ఎలకంటి విజయ్ కుమార్, చింతల కార్తీక్ రెడ్డి, మెరుగు కిరణ్, భూక్య గణేష్,తదితరులు పాల్గొన్నారు.

## విధ్వంసమైన వరంగల్ మహానగర పునర్నిర్మాణం



**ప్రజాపక్షం/హనుమకొండ:** విధ్వంసమైన వరంగల్ మహానగర పునర్నిర్మాణం వేగవంతం చేయాలని రాష్ట్ర ఉద్యమకారుల వేదిక చైర్మన్ ఆచార్య కూరపాటి వెంకటనారాయణ అన్నారు. నూతన సంవత్సరం సందర్భంగా హనుమకొండ బాలసముద్రంలో తన స్వగృహంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ గత ప్రభుత్వ పాలనలో తెలంగాణ రాష్ట్ర జిల్లాల పునర్విభజన ఒక ప్రహసనంగా మారిందని, జనాభా ప్రాతిపదిక గాని, వైశాల్యం, వనరుల లభ్యత ,అభివృద్ధి సామర్థ్యం లాంటి అంశాలను పరిగణలోకి తీసుకోకుండా కేవలం చౌకబారు రాజకీయ ప్రకటనలతో ప్రజలను ప్రలోభ పెట్టే ఎత్తుగడలతో వరంగల్ ఉమ్మడి జిల్లాను ఆరు ముక్కలు చేసి ప్రాంత అభివృద్ధిని అడ్డుకుని కాకతీయ చరిత్రను విధ్వంసం చేయడానికి పూనుకున్నారని తెలంగాణ ఉద్యమకారుల రాష్ట్ర వేదిక చైర్మన్ ప్రొఫెసర్ కూరపాటి వెంకటనారాయణ గత పాలకులపై ధ్వజమెత్తారు. ప్రస్తుత పాలకులు ఈ నగర పునర్నిర్మాణానికి చర్యలు చేపట్టాలని శుక్రవారం ప్రొఫెసర్ కూరపాటి వెంకట్ నారాయణ తన స్వగృహంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయనతో పాటు డాక్టర్ సంగని మల్లేశ్వర్, సాయిని నరేందర్, డాక్టర్ చందా మల్లయ్య, డాక్టర్ నల్లాని శ్రీనివాస్,మెరుగు బాబు యాదవ్, డాక్టర్ సుధాకర్, పాల్గొన్నారు.

## ఎస్‌టియు డైరీ ఆవిష్కరణ



**ప్రజాపక్షం/హనుమకొండ టౌన్ :** ఎస్‌టియు 2026 నూతన సంవత్సర డైరీ హనుమకొండ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు కామగోని రాంబాబు, వేమునూరి రాంబాబు ఆధ్వర్యంలో వరంగల్ పశ్చిమ శాసన సభ్యులు నాయిని రాజేందర్ రెడ్డి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయ విద్యా రంగ సమస్యల పట్ల చిత్త శుద్ధి తో ఉన్న ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. ఉద్యోగ , ఉపాధ్యాల హెల్త్ కార్డులు, పీఆర్సీ అమలుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఆర్థిక కార్యదర్శి శివకోటి, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు నామాని సాంబయ్య, అదనపు ప్రధాన కార్యదర్శి సూర రమేష్, రాష్ట్ర పూర్వ ఆర్థిక కార్యదర్శులు ఆట సదయ్య, ఆర్. సుధాకర్ రెడ్డి, ఆర్థిక కమిటీ సభ్యులు మాలోత్ గణపతి, వరంగల్ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శి మధులిమాయే, నాగరాజు, ఆర్థిక కార్యదర్శి శ్రీధర్, హనుమకొండ జిల్లా బాధ్యులు వీర బ్రహ్మేంద్ర చారి, మహేందర్, బాబు, పరమేశ్వర్, సుమన్ తదితరులు పాల్గొన్నారు.

## నేచురల్ , సేంద్రియ రైతుల సంత ఘనంగా ప్రారంభం



**ప్రజాపక్షం/హనుమకొండ టౌన్ :** హనుమకొండ నేరెళ్ల వేణుమాధవ్ ప్రాంగణంలో న్యాచురల్, సేంద్రియ రైతుల సంతను శుక్రవారం ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా గ్రామభారతి ప్రాంత అధ్యక్షురాలు సూర్యకళ మాట్లాడుతూ, సేంద్రియ ఉత్పత్తులు, సిరిధాన్యాలు, గో ఆధారిత ఉత్పత్తులు వినియోగించడం వల్ల మంచి ఆరోగ్యం లభిస్తుందని తెలిపారు. రసాయనాలు లేని ఆహారం నేటి జీవన శైలిలో ఎంతో అవసరమని, ప్రతి కుటుంబం సేంద్రియ ఉత్పత్తుల వైపు మొగ్గు చూపాలని ఆమె పిలుపునిచ్చారు.ఈ సంత ఈ నెల 2, 3, 4 తేదీలలో జరగనుండగా, నగరవాసులు నేరుగా రైతుల వద్ద నుంచి స్వచ్ఛమైన, నాణ్యమైన ఉత్పత్తులు కొనుగోలు చేసుకునే అవకాశం కల్పిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు.రిటైర్డ్ ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపల్ చిలకమారి సంజీవ మాట్లాడుతూ, ప్రతి ఒక్కరూ వీలు చేసుకుని ఈ సంతను సందర్శించాలని కోరారు.సంత ముఖ్య నిర్వాహకులు భయ్య సారయ్య మాట్లాడుతూ, సేంద్రియ పద్ధతుల్లో సాగు చేసే రైతులను ప్రోత్సహించడమే తన ప్రధాన ఆశయమని తెలిపారు. రైతులకు న్యాయమైన ధర లభించేలా, వినియోగదారులకు నాణ్యమైన ఉత్పత్తులు అందించే లక్ష్యంతో నెలకు రెండుసార్లు ఈ సంతను నిర్వహించనున్నట్లు వెల్లడించారు.ప్రముఖ సామాజికవేత్త, మిల్లెట్ ప్రమోటర్ నిమ్మల శ్రీనివాస్ మాట్లాడుతూ, ఉమ్మడి ఓరుగల్లు జిల్లాను ప్లాస్టిక్ రహిత జిల్లాగా మార్చడమే తన ఆశయం అని అన్నారు. అందులో భాగంగానే ఈ సంతలో ఎటువంటి ప్లాస్టిక్ కవర్లు వినియోగించకుండా ప్రత్యేక చర్యలు తీసుకున్నామని తెలిపారు. సేంద్రియ ఉత్పత్తుల విక్రయంలో బయోడిగ్రేడబుల్ కవర్స్, పేపర్ ప్యాకింగ్, మరియు స్టీల్ డబ్బాలు మాత్రమే వినియోగిస్తున్నట్లు చెప్పారు. ఇది పర్యావరణ పరిరక్షణకు తోడ్పడటమే కాకుండా భవిష్యత్ తరాలకు మంచి సందేశాన్ని అందిస్తుందని అన్నారు. ఈ సంతలో ఖమ్మం నుండి విచ్చేసిన సురభి హెల్తీ ప్రొడక్ట్స్ నిర్వాహకులు అనిల్ బయో డీగ్రేడబుల్ వస్తువులను మాత్రమే వాడటం చూసి ఆయనను నిర్వాహకులు అభినందించారు.ఈ కార్యక్రమంలో పోలీస్ అధికారి సంధ్య, కృష్ణ కుమార్, శివరంజని తదితరులు పాల్గొన్నారు. సేంద్రియ వ్యవసాయం, ఆరోగ్యం, పర్యావరణ పరిరక్షణపై అవగాహన పెంపొందించడంలో ఈ సంత కీలక పాత్ర పోషిస్తుందని వక్తలు అభిప్రాయపడ్డారు

## పాత నేరస్థుల కదలికలపై నిఘా

**ప్రజాపక్షం/వరంగల్ టౌన్ :** గతంలో చోరీలకు పాల్పడిన అంతర్ రాష్ట్ర దొంగలపై నిఘా పెట్టాలని వరంగల్ పోలీస్ కమిషనర్ సిసి ఎస్ పోలీసులకు పిలుపునిచ్చారు.వార్షిక తనిఖీల్లో భాగంగా వరంగల్ పోలీస్ కమిషనర్ సిటీ క్రైమ్ స్టేషన్ ను శుక్రవారం తనిఖీ చేశారు. తనిఖీల కోసం సిసి ఎస్ కు చేరుకున్న సిపికి అధికారులు పుష్పగుచ్చాలను అందజేసి స్వాగతం పలకగా, సాయుధ పోలీసులు గౌరవ వందనం చేశారు. పోలీస్ స్టేషన్ సిబ్బంది కిట్ ఆర్టికల్స్ పరిశీలించిన అనంతరం సీపీ పాత నేరస్తుల ఫోటోలను పరిశీలించి, స్టేషన్ రికార్డులను పరిశీలించి, చోరీల నివారణకు తీసుకుంటున్న చర్యలను సీపీ సంబంధిత స్టేషన్ అధికారులను అడిగి తెలుసుకోవడంతో పాటు, చోరీల నియంత్రణ కోసం చేపట్టాల్సిన ముందస్తు చర్యలను అధికారులు సూచించారు.ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ చోరీ కేసుల్లో జైలు కి తిరిగి విడుదలయిన నిందితుల సమాచారం సేకరించాలని, ఇతర రాష్ట్రాల్లో చోరీ కేసుల్లో పట్టుబడిన నిందితుల వివరాలను అందుబాటులో వుంచుకోవాలని సీపీ తెలియజేసారు.ఈ తనిఖీల్లో క్రైమ్స్ అదనపు డీసీపీ బాలస్వామి, ఏసీపీ సదయ్య, సిసిఎస్ ఇన్స్పెక్టర్లు రాఘవేందర్, రామకృష్ణతో ఎస్. ఐలు ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

## రామప్ప చెరువు ఆయకట్టుకు పూర్తిస్థాయి సాగుకు తైబెంది ఖరారు

**ప్రజాపక్షం/వెంకటాపూర్ (రామప్ప) :** రామప్ప చెరువు పరిధిలోని ఆయకట్టులో సాగవుతున్న పూర్తిస్థాయి పంట సాగుకు అనుమతిస్తున్నట్లు ములుగు నీటిపారుదల శాఖ డిఈ రవీందర్ తెలిపారు. బుధవారం పాలంపేట గ్రామంలోని రైతువేదిక హాలులో జరిగిన నీటిపారుదల, వ్యవసాయ, రెవిన్యూ ,మరియు రైతులతో తైబందీ గురించి సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రామప్ప చెరువులో 33 ఫీట్ల నీటి సామర్థ్యం ఉన్నందున రామప్ప చెరువు ఆయకట్టు పూర్తిగా సాగుకు అనుకూలంగా వీలవుతుందని డి ఈ . పేర్కొన్నారు. రామప్ప చెరువు లోని పంట సాగు కోసం అధికారులు రైతుల తో నిర్వహించిన సమావేశం పూర్తిస్థాయి పంట సాగు కోసం ఏకగ్రీవ తీర్మానం జరిగిందని డి ఈ తెలిపారు. జనవరి 5వ తేదీ నుండి కాలువలు నీటి విడుదల జరుగుతుందని డి ఈ రవీందర్ అన్నారు. చెరువులో కానీ కాలువలలో మోటర్లు ఇంజన్లు బిగించి అనైతికంగా నీటిని వాడుకుని రైతులకు ఇబ్బంది కలిగించినట్లయితే చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని డి ఈ రవీందర్ హెచ్చరించారు.. ఈ కార్యక్రమంలో తాసిల్దార్ గిరిబాబు ,ఏఈ శివకుమార్, ఏవో శైలజ, ఏఈఓ సునీల్, రైతులు, జగన్మోహన్‌రావు, బుర్ర సమ్మయ్య, దండేపల్లి సారంగం, తడుక బాబు, పంతుల ఐలయ్య బుసిగింపుల కిష్టయ్య, పాలంపేట, రామంజపూర్, వెలుతుర్లపల్లి, నారాయణగిరిపల్లి, గ్రామాల రైతులు పాల్గొన్నారు

## చైనా మాంజాను వాడకూడదు: హసన్‌పర్తి సిఐ



**ప్రజాపక్షం/హసన్‌పర్తి:** నిషేధిత చైనా మాంజా సింథటిక్ నైలాం దారం కలిగినది అమ్మడం, కొనడం ప్రభుత్వంగా పూర్తిగా నిషేధించిందని, అక్రమంగా అమ్మే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హసన్‌పర్తి సీఐ వట్టె చేరాలు అన్నారు. హసన్‌పర్తిలోని సుజాత పాఠశాలలో చైనా మాంజాను నిషేదించాలని పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమాన్ని పర్యావరణ పరిరక్షణ మిత్ర యూనిట్ ఆధ్వర్యంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఆకుతోట శాంతారాం కర్ణ అధ్యక్షతన జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన సీఐ వట్టె చేరాలు మాట్లాడుతూ.. సంక్రాంతి పండుగ సందర్భంగా ఎగురవేసే గాలి పటాలకు చైనా మాంజా దారం కట్టడం వల్ల పర్యావరణానికి హాని ఏర్పడటమే కాకుండా పక్షుల ప్రాణాలకు ముప్పుగా మారుతుందని, వాహనదారులు, పిల్లలు ప్రాణాలు కోల్పోతున్నారన్నారు. కావున చైనా మాంజాను విక్రయిస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ఎవరైనా అమ్మితే వెంటనే 100, 112 కు కాల్ చేయాలన్నారు. ప్రిన్సిపాల్ శాంతారాం కర్ణ మాట్లాడుతూ.. మన పాఠశాలలో 30 ఏళ్లుగా పర్యావరణ మిత్ర యూనిట్ ఆధ్వర్యంలో అనేక పర్యావరణహిత కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. అందులో భాగంగా సంక్రాంతి సందర్భంగా పర్యావరణహిత రంగోలి పేపర్ కైట్స్ ఉపయోగించాలన్నారు. చైనా మాంజా వాడొద్దని ప్రజల్లో అవగాహన కల్పించుటకు కరపత్రాలు, ర్యాలీ నిర్వహించి చైతన్యం కలిగిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్సైలు దేవేందర్, గోవర్ధన్, పాఠశాల వైస్ ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# యువతను మింగేస్తున్న విష సంస్కృతి

ప్రజాపక్షం/నెక్కొండ:తెలంగాణ నేలపై నూతన సంవత్సరం అంటే ఒకప్పుడు యుగాది, ప్రకృతితో మమేకమై, కుటుంబంతో కలిసి, జీవితానికి కొత్త అర్థం చెప్పే పండగ, కానీ నేడు డిసెంబర్ 31 అనే ఒక అర్ధరాత్రి మన ఆలోచనల్ని, అలవాటుల్ని, ముఖ్యంగా యువత భవిష్యత్తునే ప్రశ్నార్థకంగా మారుస్తోంది. 2025 డిసెంబర్ 31 అర్ధరాత్రి గ్రామాలు, పట్టణాలు అన్న తేడా లేకుండా సెలబ్రేషన్ పేరిట జరిగిన దృశ్యాలు భయంకర వాస్తవాన్ని చూపించాయి. పది మందికి ఒక గొర్రె, లక్షల సంఖ్యలో కోళ్లు, అడ్డు అదుపు లేని మద్యం సేవనం, రాత్రంతా బాణాసంచాలు కాల్చడం ఇవేనా మన యువతకు మనం నేర్పాల్సిన సంస్కృతి? ఆధునికత పేరుతో ఆంగ్లేయుల అంధానుకరణ, స్వేచ్ఛ పేరుతో స్వయంక్షయం ఈ రెండింటి మధ్య తెలంగాణ యువత నలిగిపోతుంది. ఒక్క రాత్రి మత్తు కోసం నెలల జీతం, కుటుంబ అప్పులు, చివరకు ప్రాణాలకు ప్రమాదం తెచ్చుకుంటున్న వాస్తవాన్ని ఎందుకు మనం పట్టించుకోవడం లేదు? ప్రత్యేకించి వరంగల్ జిల్లా నెక్కొండ మండలంలోని 39 గ్రామ పంచాయతీల్లో ఈ దృశ్యాలు మరింత ఆందోళన కలిగించాయి. ఇటీవలే ఎన్నికైన ప్రజా ప్రతినిధులు, ఎన్నికల ఖర్చుల నుండి ఇంకా కోలుకోకముందే, మరల ఈ సంబరాల పోటీలోకి దిగాల్సిన పరిస్థితి. రాజకీయ పార్టీలు వాటి శ్రేణులు యువతను ఉత్సవాల పేరుతో వినియోగించుకుంటు. చివరకు ఆ భారాన్ని కుటుంబాలపై మోపుతున్నాయా అనే ప్రశ్న ప్రజల్లో వినిపిస్తోంది. ఈ మద్యం మత్తులో జరిగే రోడ్డు ప్రమాదాలు, గొడవలు, కుటుంబ కలహాలు ఎవరి ఖాతాలోకి వెళ్తున్నాయి? ఒక యువకుడు ఒక్క రాత్రి మత్తులో తీసుకున్న నిర్ణయం ఒక కుటుంబానికి జీవితాంతం మచ్చగా మరుతున్న సందర్భాలు ఎన్నో అయినా సెలబ్రేషన్ పేరుతో ఈ విష సంస్కృతిని ఎందుకు ప్రోత్సహిస్తున్నాం? యువతా..ఒక ప్రశ్న మీ ముందుంది. ప్రజా ప్రతినిధులు రాజకీయ పార్టీలు అభ్యుదయవాదులు తెలంగాణ శ్రేయస్సు కోరే మేధావులు సామాజిక నాయకులు యువతను మత్తువైపు నడిపించేది కాదు కానీ చెప్పాల్సిన బాధ్యత మీపై ఉందని యువత మద్యం సీసాలు కాదు కలం ఉండాలని, బాణాసంచా కల్చడం కాదు ఆలోచన ఉండాలని చెప్పాలి. నూతన సంవత్సరం అంటే కొత్త అలవాట్లు కొత్త సంకల్పాలు, కొత్త దిశగా కానీ మనం ఎంచుకుంటున్న దారి వినాశనానికి దారి తీస్తే అది నూతనం కాదు నాశనం.

# ఉచిత నట్టల నివారణ మందులను వినియోగించుకోవాలి



ప్రజాపక్షం/రాయపర్తి:ఉచిత నట్టల నివారణ మందులను గొల్ల, కురుమలు వినియోగించుకోవాలని సర్పంచ్ పెదగోని నాగరాజు అన్నారు. మండలంలోని మొరిపిరాల గ్రామంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఉచిత నట్టల నివారణ పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గొల్ల కురుమల కుటుంబాలు జీవాలపై ఆధారపడి జీవిస్తారని అన్నారు. నట్టల నివారణ మందులతో జీవాలలో వ్యాధి నిరోధక శక్తి పెరుగుతుందని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఉచితంగా పంపిణీ చేస్తున్న నట్టల నివారణ మందులను గొల్ల కురుమలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ కుక్కల మహేందర్, పశు వైద్య సహాయకులు వెంకటయ్య, గణేష్, గొల్ల కురుమలు వేల్పుల శ్రీనివాస్, బొమ్మరబోయిన మహేష్, ఏనుగు బలయ్య, ఏనుగు యాదయ్య, బొమ్మరబోయిన సోమయ్య, జోగు బుచ్చం, బుర్రి మల్లేశం, నాలి వెంకన్న, వేల్పుల జంపయ్య, పాల్గొన్నారు.

# గ్రామీణ ప్రజలకు చేరువైన బ్యాంకింగ్ సేవలు

ప్రజాపక్షం/నెక్కొండ:గ్రామీణ ప్రాంత ప్రజలు ఎదుర్కొంటున్న బ్యాంక్ లావాదేవీల కష్టాలకు పరిష్కారంగా బ్యాంక్ మిత్రులు వ్యవస్థ ప్రజాహిత దిశగా కీలకపాత్ర పోషిస్తుంది. బ్యాంక్ అధికారులు ప్రయివేట్ వ్యక్తులకు ఉపాధి కల్పిస్తూ వారిని బ్యాంక్ మిత్రులుగా నియమించడం ద్వారా ఒక వైపు నిరుద్యోగ సమస్యకు కొంత ఉపశమనం కల్పిస్తుండగా మరోవైపు ప్రజలకు సులభమైన బ్యాంకింగ్ సేవలు అందుబాటులోకి తెస్తున్నారు. ప్రధానంగా మహిళా స్వయం సహాయక సంఘాల సభ్యులు ప్రతి నెల చేసే పొదుపులు, రుణాల చెల్లింపుల కోసం ఇప్పటి వరకు బ్యాంకుల వద్ద గంటల తరబడి క్యూలైన్‌లో నిలబడాల్సిన పరిస్థితి ఉండేది. బ్యాంక్ మిత్రల వ్యవస్థ అమల్లోకి రావడంతో మహిళా సంఘాల సభ్యులు నుండి నేరుగా పొదుపులు సేకరించి వారి ఖాతాల ద్వారా బ్యాంక్‌లో జమ చేసి వెంటనే రసీదు అందజేస్తున్నారు. దీని వలన మహిళలకు సమయం వృథా తగ్గడమే కాకుండా భద్రతతో కూడిన లావాదేవీలు సాధ్యమవుతున్నాయి. ఈ విధానం మహిళా సంఘాల కార్యకలాపాలను మరింత సమర్థవంతంగా మార్చడమే కాకుండా, మహిళలపై ఉండే ఆర్థిక భారాన్ని తగ్గించడంలో దోహదం పడుతుంది. . మొత్తంగా బ్యాంక్ మిత్రల వ్యవస్థ గ్రామీణ ప్రజల జీవనశైలిలో సానుకూల మార్పులు తీసుకువస్తూ, ప్రజలకు చేరువైన బ్యాకింగ్ సేవల ద్వారా సమాన ఆర్థిక అవకాశాలు కల్పించడంలో ప్రజాహిత కార్యక్రమంలో గెలుస్తోంది. ఈ విధానం మరింత విస్తృతంగా అమలైతే గ్రామీణ ఆర్థిక అభివృద్ధికి మరింత బలం చేకూరుతుందని మహిళా సంఘాల ప్రజలు అభిప్రాయపడుతున్నారు.

# మేయర్‌కు శుభాకాంక్షలు తెలిపిన కమిషనర్



ప్రజాపక్షం/ఖిలా వరంగల్:నూతన ఆంగ్ల సంవత్సరాన్ని పురస్కరించుకొని బల్దియా కమిషనర్ చాహత్ బాజ్ పాయ్ నగర మేయర్ గుండు సుధారాణిని బల్దియా ప్రధాన కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిసి పూలమొక్కను అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం కమిషనర్‌కు శుభాకాంక్షలు తెలిపిన మేయర్ మాట్లాడుతూ ఈ నూతన సంవత్సరంలో నగరం మరింత అభివృద్ధిలో దూసుకెళ్తుందనే ఆశాభావం వ్యక్తం చేశారు.

**మేయర్, కమిషనర్‌కు శుభాకాంక్షలు తెలిపిన అధికారులు సిబ్బంది**

నూతన ఆంగ్ల సంవత్సరం 2026ను పురస్కరించుకొని బల్దియాకు చెందిన వివిధ విభాగాల ఉన్నతాధికారులు సిబ్బంది నగర మేయర్ గుండు సుధారాణి, కమిషనర్ చాహత్ బాజ్ పాయ్‌లను ప్రధాన కార్యాలయంలో కలిసి పూలమొక్కలు, చద్దర్లు, నోట్ పుస్తకాలు, పెన్నులు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మేయర్, కమిషనర్‌కు శుభాకాంక్షలు తెలిపిన వారిలో ఎస్ఈ సత్యనారాయణ, పిఆర్ఓ ఆయుబ్ అలీ, ఇన్‌చార్జి సిటీ ప్లానర్ రవీందర్ రాడేకర్, డిప్యూటీ కమిషనర్లు ప్రసన్న రాణి, బిర్రు శ్రీనివాస్, సమ్మయ్య, అకౌంట్స్ ఆఫీసర్ శివలింగం, ఎక్జామినర్ ఆఫ్ అకౌంట్స్ జనార్దన్, జెఎఒ సరిత, ఎసిపిలు, ఇఇలు, డిఇలు, ఉద్యోగులు, కాంట్రాక్టర్లు, తదితరులు ఉన్నారు.

# ఇందిరమ్మ చీరలు పంపిణీ చేసిన సర్పంచ్

ప్రజాపక్షం/రాయపర్తి:మండల కేంద్రలోని గ్రామ పంచాయతీ కార్యాలయంలో మహిళలకు రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న ఇందిరమ్మ చీరలను శుక్రవారం సర్పంచ్ గారె సహేంద్ర బిక్షపతి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ చీరలతో మహిళల ఆత్మగౌరవం పెరుగుతుందని అన్నారు. కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం మహిళలకు పెద్దపీట వేస్తుందని, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, వడ్డీలేని రుణాలను అందజేస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ మచ్చ రమేష్, కారోబార్ మల్లయ్య, సిఏలు పుష్ప, శ్రీలత, యాకయ్య, సంధ్య, తదితరులు పాల్గొన్నారు.

# గ్రంథాలయానికి రూ.10 వేల విలువైన పుస్తకాల అందజేత

ప్రజాపక్షం/ నర్సంపేట : బ్లూమ్ విత్ బుక్స్ లెర్న్ అండ్ హెల్ప్ గ్రూప్ సహకారంతో లీడ్ లైబ్రరీ ఆధ్వర్యంలో నర్సంపేట మోడల్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల గ్రంథాలయానికి పదివేల విలువైన పుస్తకాలను ఎంఈఓ కొర్ర సారయ్య, లీడ్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు కాసుల రవికుమార్, శోభారాణి అందజేశారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథి ఎంఈఓ కొర్ర సారయ్య మాట్లాడుతూ పాఠ్యపుస్తకాలకే పరిమితమవకుండా గ్రంథాలయాల్లోని వివిధ రకాల పుస్తకాలను చదవడం ద్వారా విద్యార్థుల్లో సృజనాత్మకత, విమర్శాత్మక ఆలోచన, భాషా నైపుణ్యాలు పెరుగుతాయని తెలిపారు. లీడ్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు కాసుల రవికుమార్ మాట్లాడుతూ పుస్తకాలు తన జీవితాన్ని ఎలా మార్చాయో విద్యార్థులతో పంచుకున్నారు. పేదరికం నుంచి ఎదిగిన తన ప్రయాణంలో గ్రంథాలయాలే తనకు మార్గదర్శకులని పేర్కొన్నారు. ప్రతి పాఠశాలలో సజీవమైన గ్రంథాలయం ఉండాలని, ప్రతి విద్యార్థి రోజూ కొంత సమయం పుస్తక పఠనానికి కేటాయించాలని సూచించారు. చదవడం ఒక అలవాటు కాదు, అది ఒక ఉద్యమమని అన్నారు. ఈకార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు శాంతకుమారి, ఉపాధ్యాయులు శ్యాంప్రసాద్, సురేందర్, ఇతర ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



# విలేజ్ హెల్త్ అండ్ న్యూట్రిషన్ డే

ప్రజాపక్షం/ నర్సంపేట : నల్లబెల్లి మండలంలోని మేడపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, రుద్రగూడెం అంగన్వాడి సెంటర్‌లో విలేజ్ హెల్త్ అండ్ న్యూట్రిషన్ డే కార్యక్రమం శుక్రవారం ఘనంగా నిర్వహించారు. వరంగల్ జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ సాంబశివరావు వరంగల్ ఆదేశాల ప్రకారం జిల్లా డిప్యూటీ మాస్ మీడియా అధికారి ఈదురు అనిల్ కుమార్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, రుద్రగూడెం అంగన్వాడి సెంటర్లో నిర్వహిస్తున్న విలేజ్ హెల్త్ అండ్ న్యూట్రిషన్ డే కార్యక్రమంలో పాల్గొని వైద్య ఆరోగ్య శాఖ, ఐసిడిఎస్ డిపార్ట్మెంట్ సంయుక్తంగా అందించే సేవల గురించి వివరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ అప్పుడే పుట్టిన బిడ్డ నుండి 16 సంవత్సరాల వయసు వరకు టీకాలు వేయించాలని, గర్భిణీ స్త్రీలకు ఇచ్చే వ్యాధి నిరోధక టీకాలు సమయానుకూలంగా అందించాలని సిబ్బందికి సూచించారు. ప్రజలు వ్యాధి నిరోధక టీకాలపై అవగాహన కలిగి తప్పని సరిగా టీకాలను తీసుకొని వ్యాధులకు గురికాకుండా ఉండాలన్నారు. ప్రభుత్వం ప్రజల ఆరోగ్య అవసరాల నిమిత్తం ప్రాథమిక ఆరోగ్యఉప కేంద్రాలు పని చేస్తున్నాయని అందులోని సిబ్బంది ఆరోగ్య కార్యక్రమాలపై అవగాహన కల్పిస్తూ ప్రభుత్వ లక్ష్యాలను ప్రజలకు అందించి అందరికీ ఆరోగ్యం అందుబాటులో ఉండేటట్లు సేవలందించాలన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ మంద సుజాత రాజిరెడ్డి, ఆరోగ్య కార్యకర్త అనురాధ, ఆశా కార్యకర్త ప్రేమలత, అంగన్వాడీ టీచర్ కస్తూరి తదితరులు పాల్గొన్నారు

# నెక్కొండ మేజర్ గ్రామ సర్పంచ్‌కు ఘన సన్మానం

ప్రజాపక్షం/నెక్కొండ:నెక్కొండ మేజర్ గ్రామ పంచాయతీ ఎన్నికలలో విజయం సాధించిన సర్పంచ్ పెండ్యాల హరిప్రసాద్ ఉప సర్పంచ్ సింగం శ్రావణి ప్రశాంత్, 5వ వార్డు సభ్యురాలు యాట శ్రావణి వినీత్‌లకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేస్తూ ఘనంగా సన్మానం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని 1995–1996 సంవత్సరాలలో చదువుకున్న పెండ్యాల శ్రీనివాస్, క్లాస్మేట్స్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ప్రజాసేవ పట్ల నిబద్ధతతో గ్రామాభివృద్ధికి కృషి చేయాలని ఈ సందర్భంగా నాయకులను వారు ఆకాంక్షించారు. ఈ సన్మాన కార్యక్రమంలో కోమాండ్ల శ్రీనివాస్, మహ్మద్ ఖాజా, షైక్ యాకూబ్ పాషా, మాతంగి రమేష్(డాక్టర్), రాపాక అశోక్, బ్రహ్మణపెల్లి ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

# రైతులకు తీరని యూరియా కష్టాలు...

పత్తాలేని అధికార పార్టీ ఎమ్మెల్యేలు, మంత్రులు

* నర్సంపేట మాజీ శాసనసభ్యులు పెద్ది సుదర్శన్ రెడ్డి



ప్రజాపక్షం/నర్సంపేట: రైతులకు తీరని యూరియా కష్టాలు... పత్తాలేని అధికార పార్టీ ఎమ్మెల్యేలు, మంత్రులు.. యాసంగి పంటకు ఎంత యూరియా అవసరమో ఇప్పటివరకు అంచనా లేదు.. సమీక్ష లేదని నర్సంపేట మాజీ శాసనసభ్యులు పెద్ది సుదర్శన్ రెడ్డి విమర్శించారు. నర్సంపేట పట్టణంలోని ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ పొగ మంచులో తీవ్రచలిలో యూరియా కోసం రైతులు, మహిళలు క్యూ లైన్ లో ఉంటున్నారన్నారు. నర్సంపేట నియోజకవర్గంలో, వరంగల్ జిల్లాలో ఏ గ్రామంలో చూసిన ఇదే పరిస్థితి నెలకొందన్నారు. స్వయంగా కలెక్టరే క్యూ లైన్ లను పరిశీలించాల్సిన పరిస్థితి నెలకొందన్నారు. రైతులు, ప్రతిపక్షాలు ప్రశ్నిస్తున్న పాలకులు మాత్రం పట్టించుకోవడంలేదని విమర్శించారు. రెండు సంవత్సరాలుగా రైతులకు తీరని యూరియా కష్టాలు మొద్దు నిద్రలో అధికార కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం యంత్రాంగం ఉందన్నారు. ఎమ్మెల్యేలు, మంత్రులు వ్యవసాయ అధికారులు జిల్లాలో ఒక్క సమీక్ష నిర్వహించలేదన్నారు. కెసిఆర్ ప్రభుత్వంలో నర్సంపేట నియోజకవర్గంలో, జిల్లాలో ప్రతి సీజన్ కుసాగు అంచనాల పైన వ్యవసాయ అధికారులతో సమీక్షలు నిర్వహించి రైతులకు సరిపడా యూరియా నిల్వలను అందుబాటులో ఉంచామన్నారు. వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు యూరియా ఉందని చెబుతారు, కానీ గ్రామాలలో మాత్రం రైతులకు యూరియా సరిపడా ఇవ్వడంలేదని విమర్శించారు. సరైన సమయానికి యూరియా అంధక రైతులు పంట దిగుబడి కోల్పోయే ప్రమాదం ఉందని, ఇప్పటికే వానాకాలంలో యూరియా దొరకక రైతులు తీవ్రంగా నష్టపోయారన్నారు. రైతులను ,మహిళలను వృద్ధులను ,చిన్నపిల్లలతో సహా కుటుంబాలను మొత్తం రోడ్డుమీద క్యూలైన్లో నిలబెడుతుంది కాంగ్రెస్ ప్రభుత్వమన్నారు. మొన్నటి ఎన్నికలలో ఓట్లు వేయించుకున్న కాంగ్రెస్ నాయకులు ఈరోజు రైతులు యూరియా కోసం కష్టాలు పడుతుంటే మోఖం చాటేశారు. కొనుగోలు కేంద్రాల వద్ద కాంటాల వద్ద, కమిషన్ల కోసం ముందున్న కాంగ్రెస్ నాయకులు ఈరోజు యూరియా పంపిణీలో ఎందుకు లేరని విమర్శించారు. యూరియా పంపిణీలో వ్యవసాయ అధికారులకు, ఎమ్మెల్యేలకు, మంత్రులకు, ముఖ్యమంత్రి కి సమన్వయం లేదని, సరైన ప్రణాళిక లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తోందన్నారు. గత రెండు సంవత్సరాలుగా కాంగ్రెస్ ప్రభుత్వంలో రైతులకు అన్నీ కష్టాలే వచ్చాయని, రైతు భరోసా సరైన సమయంలో ఇవ్వలేదు, రైతులకు బోనస్ ఎగవేసినారు, కొనుగోలులో కాంగ్రెస్ నాయకులే స్వయంగా అక్రమాలు చేస్తున్నారన్నారు. కాంట్రాక్టులు, కమిషన్ల కోసం తిరుగుతూ రైతులకు, నియోజకవర్గ ప్రజలకు దూరంగా ఉంటున్న కాంగ్రెస్ ఎమ్మెల్యేలు, మంత్రులు ఇప్పటికైనా రైతుల గురించి ఆలోచించాలన్నారు.

# మేడారం మహాజాతరలో స్పెషలిస్ట్ డాక్టర్లతో వైద్య సేవలు

**ప్రజాపక్షం/ములుగు:** జనవరి మాసం చివరిలో జరగనున్న శ్రీ సమ్మక్క సారలమ్మ మహా జాతరలో భక్తులకు స్పెషలిస్ట్ డాక్టర్లతో వైద్య సేవలు అందించడానికి శుక్రవారం ఎంజిఎం హాస్పటల్ వరంగల్ నందు ఉమ్మడి వరంగల్ జిల్లా ప్రభుత్వ ఆసుపత్రుల సూపరింటిండెంట్లు, జిల్లా వైద్యరోగ్యశాఖాధికారులు, జిల్లా ఆసుపత్రుల సమన్వయకర్తలతో సమన్వయ సమావేశం నిర్వహించారు. ఎంజిఎం సూపరింటింటెండ్ డాక్టర్ హరీష్ చంద్రారెడ్డి అధ్యక్షతన జరిగిన సమావేశంలో సమ్మక్క సారలమ్మ మహా జాతరకు వచ్చే భక్త జనులకు వైద్య సేవలలో ఇబ్బందులు కల్గకుండా మెరుగైన నాణ్యతతో కూడిన వైద్య సేవలను స్పెషలిస్ట్ డాక్టర్లతో మెరుగైన వైద్య సేవలు అందించాలని నిర్ణయించడం జరిగింది. ములుగు జిల్లాకు దగ్గరగా ఉన్న ములుగు, నర్సంపేట, భూపాలపల్లి మెడికల్ కాలేజ్, అన్ని ప్రభుత్వ జనరల్ హాస్పటల్‌లో పనిచేస్తున్న స్పెషలిస్ట డాక్టర్లను జాతరలో వైద్య సేవల కొరకు డిప్యూటేషన్ ద్వారా తీసుకోవాలని నిర్ణయించారు. వీరితో పాటు ఉమ్మడి జిల్లాల



జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారుల పరిధిలో పనిచేస్తున్న వైద్యాధికారులను, సూపర్‌వైజర్లను, స్టాఫ్ నర్స్‌లను, ఆరోగ్య కార్యకర్తలను పూర్తి స్థాయిలో వినియోగించుకోవాలని, ఈసిజి టెక్నీషియన్లను, ఎంఎన్ఓ ఎంజిఎం హాస్పటల్, గవర్నమెంట్ జనరల్ హాస్పటల్ ములుగు, ఏటూరునాగారం కమ్యూనిటీ హెల్త్ సెంటర్ నుండి తీసుకోవాలని నిర్ణయించారు. మేడారం జాతర నందు ఫస్ట్ రిఫరల్ సెంటర్‌గా 50 బెడ్స్ తులతో ములుగు గవర్నమెంట్ జనరల్ హాస్పటల్ నందు సెకండరీ లెవెల్ వైద్య సేవల కొరకు 20 బెడ్ల ప్రత్యేక వార్డును,ర్డును వైద్య సేవలు ఎంజిఎం హాస్పటల్‌లో నిర్వహించాలని సమన్వయ కమిటీలో చర్చించారు. జాతరకు సరిపడా మానవ వనరులను, మందులను, పరికరాలను సమకూర్చుకొని, మెడికల్ ఎడ్యూకేషన్ వైద్య విధాన పరిషత్, పబ్లిక్ హెల్త్ డిపార్ట్‌మెంట్లు సమన్వయంతో పనిచేసి వైద్యారోగ్యశాఖను భక్తుల సేవలలో ముందు వరుసలలో నిలపాలని సమన్వయం సమావేశం కోరింది. ఈ సమావేశంలో ఎంజిఎం సూపరింటిండెంట్ డాక్టర్ హరీష్ చంద్రరెడ్డి, ఉమ్మడి వరంగల్ జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారులు డాక్టర్ సాంబశివరావు, డాక్టర్ అప్పయ్య, డాక్టర్ గోపాల్‌రావు, డాక్టర్ మధుసూదన్, డాక్టర్ రవిరాజ్, డాక్టర్ మల్లికార్జున్, జనగాం సూపరింటిండెంట్ డాక్టర్ గోపాలరావు, డాక్టర్ విజయలక్ష్మి , డిప్యూటీ డిఎంహెచ్‌లో కొత్తగూడెం డాక్టర్ జయలక్ష్మి , డాక్టర్ రామ్మూర్తి, డాక్టర్ నరేందర్, డాక్టర్ లక్ష్మీ దేవి, డాక్టర్ మురళి, డాక్టర్ మధుకర్ యాదవ్, ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ శ్రీకాంత్, డెమో అశోక్ రెడ్డి, ప్రసాద్, సంపత్ ప్రభాకర్, అంజద్ అలీ, నాగరాజు, సదానందం, తదితరులు పాల్గొన్నారు.

# కలెక్టర్‌ను కలిసిన పంచాయతీరాజ్ శాఖ స్టేట్ డైరెక్టర్



**ప్రజాపక్షం/ములుగు:** పంచాయతీరాజ్ శాఖ స్టేట్ డైరెక్టర్ బైరెడ్డి భగవాన్‌రెడ్డి శుక్రవారం ములుగు జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా బైరెడ్డి భగవాన్‌రెడ్డి కలెక్టర్‌కు పుష్పగుచ్చం అందించడంతో పాటు శాలువాతో సత్కరించారు. పంచాయతీరాజ్ శాఖ స్టేట్ డైరెక్టర్‌గా నియమాకమైన తర్వాత మొదటిసారిగా కలెక్టర్‌ను కలవడం పట్ల ఆయన భగవాన్‌రెడ్డికి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో భగవాన్‌రెడ్డితో కాంగ్రెస్ పార్టీ వెంకటాపూర్ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ బండి శ్రీనివాస్, నాయకులు బుర్ర సమ్మయ్య గౌడ్, మాడుగుల రమేష్, తదితరులు ఉన్నారు.

# బావిలో పడి యువతి మృతి

**ప్రజాపక్షం/గూడూరు:** మహబూబాబాద్ జిల్లా గూడూరు మండలం లో బావిలో పడి యువతి మృతి చెందిన సంఘటన సోమవారం వెలుగుచూసింది. వివరాల్లోకీ వెళితే మహబూబాబాద్ జిల్లా గూడూరు మండలం తేజావత్ రామ్‌సింగ్ గ్రామ శివారు దిడ్డితండాకు చెందిన గుగులోత్ అఖిల (19)అనే యువతి పదోతరగతి వరకు చదువుకుంది తల్లిదండ్రులకు వ్యవసాయ పనులు చేదోడువాదులుగా ఉంటుండగా శుక్రవారం మేకలను మేపడానికీ వెళ్లిన అఖిల ప్రమాదవశాత్తు వ్యవసాయ బావిలో పడి మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. సమాచారం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకోని మృతదేహాన్ని వెలికి తీసి పోస్టుమార్టం నిమిత్తం గూడూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృదురాలి తండి గుగులోత్ సూర్య ఇచ్చిన పిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకోని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై గిరిధర్ రెడ్డి తెలిపారు. దీంతో పెళ్లీడుకొచ్చిన కూతురు మృతి చెందడంతో కుటుంబ సభ్యుల రోదనలు మిన్నంటాయి. అఖిల మృతి తో తేజవత్ రామ్ సింగ్ తండాలో విషాదఛాయలు అలుముకున్నాయి.

# కేసముద్రంలో బిఆర్ఎస్‌కి భారీ షాక్ కాంగ్రెస్‌లోకి నేత

**ప్రజాపక్షం/కేసముద్రం:** కేసముద్రం మండలంలో బిఆర్ఎస్ పార్టీకి భారీ షాక్ తగలనుంది. కేసముద్రానికి చెందిన సీనియర్ నాయకులు, తన సామాజిక వర్గం, తనతో కలిసి వచ్చే బిఆర్ఎస్ నాయకులతో కలిసి కాంగ్రెస్‌లో చేరడానికి ముహూర్తం ఖరారైంది. కేసముద్రం మండలంలో బిఆర్ఎస్ పార్టీని తన భుజాలపై వేసుకొని నడిపించిన, బిఆర్ఎస్ కీలకనేత, కేసముద్రం వ్యవసాయ కమిటీ మాజీ చైర్‌పర్సన్ నీలం సుహాసిని భర్త, ముదిరాజ్ మహాసభ రాష్ట్ర నాయకుడు నీలం దుర్గేష్ శుక్రవారం కాంగ్రెస్ పార్టీలో చేరడానికి మహబూబాబాద్ ఎమ్మెల్యే డాక్టర్ భూక్య మురళీ నాయక్ సమక్షంలో గాంధీభవన్‌కు స్థానిక మండల నాయకులతో కలిసి వెళ్లారు. అంతకుముందు కేసముద్రం మున్సిపల్ కేంద్రంలోని మహాత్మ జ్యోతిబా పూలే విగ్రహానికి మండల కాంగ్రెస్ అధ్యక్షుడు అల్లం నాగేశ్వర రావు, డిసిసి ఉపాధ్యక్షుడు అంబటి మహేందర్ రెడ్డి, తెలంగాణ ప్రాంతీయ రవాణా అథారిటీ జిల్లా సభ్యులు రావుల మురళి, సీనియర్ నాయకులు గుగులోత్ దస్రు నాయక్, బండారు వెంకన్న, బండారు దయాకర్, చిలువేరు



సమ్మయ్య గౌడ్, కదిర సురేందర్ తదితర నాయకులతో కలిసి పూలమాల వేసి హైదరాబాద్‌కు భారీ వాహన ర్యాలీతో బయలుదేరారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధిని గుర్తించి ముఖ్యంగా ముదిరాజ్ కులస్తులను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తన బిడ్డలుగా చూసుకుంటూ అభివృద్ధి పథంలో ముందుకెళ్తున్నాడని, అలాగే కేసముద్రం మున్సిపాలిటీని నాలుగు, ఐదు కోట్ల రూపాయలతో అభివృద్ధి చేయడం జరుగుతుందని, ప్రజలకు అందుబాటులో ఉంటూ సేవ చేయాలనే ఉద్దేశ్యంతోనే కాంగ్రెస్‌లోకి చేరుతున్నట్లు దుర్గేష్ తెలిపారు.

# కొత్తగూడ అడవుల్లో పులి గుర్తించిన అటవీ శాఖ అధికారులు

**ప్రజాపక్షం/గూడూరు/కొత్తగూడ:** గత కొన్ని రోజులుగా మహబూబాబాద్ జిల్లా కొత్తగూడ మండలంలో పులి తిరుగుతుందని ప్రచారం జోరుగా సాగగా అటవీ శాఖ అధికారులు సోమవారం పులి సంచారం నిజమే అని నిర్ధారించారు.వివరాలు కి వేళ్తే మహబూబాబాద్ జిల్లా కొత్తగూడ మండలం ఓటాయి రాంపూర్ కర్ణగుడి అటవీ ప్రాంలంలో పులి సంచరిస్తున్నట్లు సమాచారం అందుకున్న అధికారులు అటవీ ప్రాంతంలో పర్యటించి పులి అడుగులు గుర్తించారు. ములుగు జిల్లా జాకారం అటవీ ప్రాంతం నుండి పులి ఎటువైపు వెళ్లిందని దిశగా అధికారులు పరిశీలిస్తుండగా కొత్తగూడ మండలం రెన్యూతండా సమీపంలో కాలిబాటలో పులి అడుగులను గుర్తించారు.అయితే ఆ పులి లింగాల వైపు వెళ్లిందా కర్ణగుడి వైపు వెళ్లిందా అనేది అటవీ శాఖ అధికారులు పరిశీలిస్తున్నారు.కొత్తగూడ అడవుల్లో పులి కదలికలను నిర్ధారించిన అటవీశాఖ అధికారులు సమీప గ్రామస్తులకు పలు సూచనలు చేశారు.రాత్రివేళలో బయటికి రావద్దని అటవీ ఉత్పత్తుల కోసం అడవిలోకీ వెళ్లేవారు అదేవిధంగా గోర్లను కాసే గోర్ల కాపరులు సాయంత్రం లోపు తమ గృహాల్లోకి చేరాలని అన్నారు.జిల్లా అటవీశాఖ అదికారి విశాల్ అదేశాలతో అన్ని బీట్లలో అధికారులు సిబ్బందిని అలర్ట్ చేశారు.పులి సంచారం నేపథ్యంలో అందరూ అప్రమత్తంగా ఉండాలని అన్నారు.

# ఓసి క్లబ్ స్వాధీన జాప్యంపై చర్యలు తీసుకోవాలి

**ప్రజాపక్షం/మహబూబాబాద్:** మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో గల ఓసి క్లబ్ లు వెంటనే స్వాధీనం చేసుకోవాలని కోరుతూ జిల్లా అడిషనల్ కలెక్టర్ కు సిపిఐ మాజీ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ బి అజయ్ సారథి రెడ్డి ఆధ్వర్యంలో శుక్రవారం సిపిఐ ప్రతినిధి బృందం వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా సమస్యను అడిషనల్ కలెక్టర్ కు సిపిఐ మాజీ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ బి అజయ్ సారథి రెడ్డి వినిపిస్తూ వెంటనే క్లబ్ ను స్వాధీనం చేసుకోవాలని కోరారు. కొంతమంది కబ్జా చేయాలని చూస్తున్నారని నాడు టిఆర్ఎస్ హయాంలో కొంతమంది ప్రజా ప్రతినిధులు వేరే పేరుతో అక్రమంగా కబ్జా చేయాలని చూస్తే మున్సిపాలిటీ కౌన్సిల్ లో మరియు ప్రజాక్షేత్రంలో ఆ క్లబ్ స్థలం ముమ్మాటికి మున్సిపాలిటీ ప్రభుత్వానిదే అని పోరాటం చేసిన విషయం వివరించారు. సిపిఐ ఆధ్వర్యంలో దశలవారీగా ఉద్యమించామని దీక్షలు ఆందోళనలు చేశామని ముఖ్యంగా మహబూబాబాద్ ఎమ్మెల్యే భూక్యా మురళి నాయక్, ఎంపీ బలరాం నాయక్ దృష్టికి తీసుకువచ్చామని, జిల్లా కలెక్టర్ దృష్టికి కూడా తీసుకువచ్చామని చెప్పారు వందల కోట్ల విలువైన ఈ స్థలాన్ని ప్రభుత్వం స్వాధీనం చేసుకొని ప్రజల బహుళ ప్రయోజనాల కోసం ఉపయోగించాలని కోరారు. కళాక్షేత్రం మరియు ఎడ్యుకేషనల్ హబ్ ఇండోర్ స్టేడియం లాంటివి ప్రజలకు ఉపయోగపడే విధంగా వినియోగించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పెరుగు కుమార్, వీరవెల్లి రవి, ఎండి మహమూద్, గార రవి చంద్రబోస్ పాల్గొన్నారు. స్పందించిన అడిషనల్ కలెక్టర్ ఓసి క్లబ్ ప్రాంతాన్ని సందర్శించి దానిపై వెంటనే చర్యలు తీసుకొని స్వాధీనం చేసుకునే విధంగా కృషి చేస్తామని హామీ ఇచ్చారు.



# రైతులకు యూరియా పంపిణీలో సమస్యలు రాకుండా చూడాలి

**ప్రజాపక్షం/మహబూబాబాద్:** రైతులకు యూరియా పంపిణీలో ఎలాంటి పొరపాట్లు రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా వ్యవసాయ అధికారిని గారిని ఆత్మ కమిటీ చైర్మన్ నల్లు సుధాకర్ రెడ్డి కోరారు. మహబాద్ జిల్లా కలెక్టర్ కార్యాలయంలో నూతనంగా బాధ్యతలు స్వీకరించిన జిల్లా వ్యవసాయ అధికారిని బి సరితని మర్యాదపూర్వకంగా కలిసి బొకే అందించి అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా సుధాకర్ రెడ్డి మాట్లాడుతూ రైతులు దరఖాస్తు చేసుకున్న వ్యవసాయ యంత్ర పరికరాలను త్వరిత గతిన అందించాలని, యూరియా పంపిణీలో రైతులకు ఇబ్బంది కలగకుండా చూసుకోవాలని సూచించారు. జిల్లా వ్యవసాయ అధికారిని స్పందిస్తూ తగినంత యూరియా నిల్వలు జిల్లాలో పుష్కలంగా ఉన్నాయని రైతులు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, అనవసర నిల్వలు పెట్టుకోవద్దని, వ్యవసాయ యంత్ర పరికరాలు త్వరలోనే రైతులకు అందిస్తామని బరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో అంబేద్కర్ యువజన సంఘం జిల్లా అధ్యక్షులు కామ సంజీవరావు, సిపిఐ నాయకులు పోలేపాక వెంకన్న, సిరోలు వ్యవసాయ అధికారి ఛాయారాజ్, మురళి పాల్గొన్నారు.

# పసర సెంటర్‌లో సెంట్రల్ లైటింగ్ ...ఉనట్టా లేనట్టా ?

**ప్రజాపక్షం/గోవిందరావుపేట:** మండల కేంద్రంలోని పస్రా గ్రామంలో ఏర్పాటు చేసిన సెంట్రల్ లైటింగ్ ప్రజలకు ప్రయోజనం చేకూర్చడం లేదని స్థానికలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు జాతరలు పండుగలు రద్దీ సమయంలో గ్రామం వెలుగులతో కళకళలాడాల్సిన పసర సెంటర్ రాత్రి వేళ చీకట్లోనే మగ్గుతుంది కొన్ని లైట్లు వెలిగినా మరికొన్ని పూర్తిగా పనిచేయకపోవడంతో సెంట్రల్ లైటింగ్ ఉన్నట్టా లేనట్టా నా అనే పరిస్థితి నెలకొంది ముఖ్యంగా పస్రా చౌరస్తాలో బస్టాండ్ పరిసరాలు ప్రధాన రహదారుల వద్ద సరైనా వెలుతురు లేకపోవడంతో వాహనదారులు పాదచారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు రాత్రి వేళ ప్రమాదాలు ముప్పు కూడా పెరుగుతోందని గ్రామస్తులు వ్యక్తం చేస్తున్నారు జాతర సమయం దగ్గర పడతంతో వేలాది మంది భక్తులు తరలివచ్చే నేపథ్యంలో లైటింగ్ సమస్య తీవ్రంగా మారిందని చెబుతున్నారు సెంట్రల్ లైటింగ్ నిర్వహణపై సంబందిత అధికారులు గ్రామ పంచాయతీ నిర్లక్ష్యం వహిస్తున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి పనిచేయని లైట్లను వెంటనే మరమ్మత్తులు చేసి పూర్తిస్థాయిలో సెంట్రల్ లైటింగ్ ను అందుబాటులోకి తీసుకరావలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

# ఐక్య పోరాటాలతోనే పద్మశాలీల సమస్యలు పరిష్కారం

**ప్రజాపక్షం/తొర్రూరు:** ఐక్య పోరాటాలతోనే పద్మశాలీల సమస్యలు పరిష్కారమవుతాయని తెలంగాణ ప్రాంత పద్మశాలి సంఘం మహబూబాబాద్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ వన్నాల సాగర్, గౌరవ అధ్యక్షులు డాక్టర్ కుసుమ సుదర్శన్ అన్నారు. శుక్రవారం తొర్రూరు పద్మశాలి మండల సంఘం ఆధ్వర్యంలో నూతన సంవత్సర క్యాలెండర్‌ను సంఘం అధ్యక్షులు వంగ అమరేందర్ అధ్యక్షతన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా తెలంగాణ ప్రాంత పద్మశాలి సంఘం మహబూబాబాద్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ వన్నాల సాగర్, గౌరవ అధ్యక్షులు డాక్టర్ కుసుమ సుదర్శన్ మాట్లాడుతూ పద్మశాలీల సమస్యల పరిష్కారం కోసం పద్మశాలీలు ఐక్యంగా పోరాటం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో మార్కండేయ గౌరవ సలహాదారులు చిలకమారి రామచంద్రయ్య, బుదారపు రమేశ్, మండల కోశాధికారి బాసాని శ్రీనివాస్, మండల యువజన సంఘం అధ్యక్షులు చంద రాజు, సంఘం ప్రధాన కార్యదర్శి పెండెం జి.ముత్తిలింగం, శివరాం, జి.భాస్కర్, జి.ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

# సర్పంచ్ చేతుల మీదుగా బోర్ మోటార్ స్టార్టర్ అందజేత

**ప్రజాపక్షం/గోవిందరావుపేట:** లింగాల గ్రామపంచాయతీ లోని త్రాగునీటి సమస్యలు తలెత్తకుండా చర్యలు చేపడుతూ సర్పంచ్ బోర్ మోటార్ సార్టర్ట్ ను అందజేశారు గ్రామ పంచాయతీ పరిధిలోని బోర్‌వెల్‌కు మోటార్ స్టార్టర్ చెడిపోవడంతో కొంతకాలంగా నీటి సరాఫరాలో అంతరాయం ఏర్పడింది ఈ విషయాన్ని గుర్తించిన సర్పంచ్ వెంటనే స్పందించి కొత్త స్టార్టర్‌ను ఏర్పాటు చేయంచారు సర్పంచ్ చొరవతో సమస్య తక్షణమే పరిష్కారమవ్వడంతో గ్రామస్తులు హర్షం చేస్తూ కృతజ్ఞతలు తెలిపారు ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ వార్డుసభ్యులు గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

## మాజీ ఎంపిపి భర్త మృతి పలువురు పరామర్శ

**ప్రజాపక్షం/రఘునాథపల్లి:** మండలంలోని అశ్వరావుపల్లి గ్రామానికి చెందిన మాజీ ఎంపీపీ దాసరి అనిత భర్త దాసరి బుగ్గయ్య గత కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతూ గురువారం మృతిచెందగా విషయం తెలుసుకున్న స్టేషన్‌ఘనపూర్ మాజీ ఎమ్మెల్యే డా. తాటికొండ రాజయ్య, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మారుజోడు రాంబాబు శుక్రవారం అశ్వరావుపల్లి గ్రామానికి చేరుకుని బుగ్గయ్య మృతదేహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం మృతుని కుటుంబ సభ్యులను పరామర్శించి వారి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. అదేవిధంగా ఇదే గ్రామంలో అనారోగ్యంతో మృతిచెందిన ఆటో డ్రైవర్ శ్రీనివాస్‌గౌడ్, మండలి ఎల్లమ్మ కుటుంబాలను సైతం పరామర్శించి వారి కుటుంబ సభ్యులకు తమ ప్రగాఢ సంతాపాన్ని తెలియజేశారు. పరామర్శించిన వారిలో వివిధ పార్టీలకు చెందిన నాయకులు, మాజీ ప్రజాప్రదినిధులు, ముదిరాజ్ సంఘం జిల్లా నాయకులు, గ్రామస్థులున్నారు.

## ఎస్‌టి హాస్టల్ ఘటనపై కలెక్టర్ సీరియస్

**ప్రజాపక్షం/కొడకండ్ల:** మండల కేంద్రంలోని ఎస్టీ బాలుర వసతి గృహంలో పదవ తరగతి విద్యార్థి ప్రభాకర్‌పై జరిగిన దాడి ఘటనపై జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ సీరియస్ అయి విచారణకు ఆదేశించారు. కలెక్టర్ ఆదేశాల మేరకు అసిస్టెంట్ ట్రైబల్ డెవలప్ మెంట్ ఆఫీసర్ హాసీనా, స్పెషల్ ఆఫీసర్ విక్రమ్ శుక్రవారం హాస్టల్‌ను సందర్శించి క్షేత్ర స్థాయిలో తనిఖీలు చేపట్టారు. అధికారులు దాడి వివరాలను అడిగి తెలుసుకున్నారు. భద్రతా లోపాలపై ఆరాతీశారు. ఇదే సమయంలో విద్యార్థి తల్లిదండ్రులు అధికారులను కలిసి వినతిపత్రం అందజేశారు. మద్యం మత్తులో హాస్టల్‌లోకి చొరబడి తమ కుమారుడిని చిత్రహింసలకు గురి చేసిన నిందితునిపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు.ఈ ఘటనపై విచారణ పూర్తి చేసి చర్యలు తీసుకుంటామని అదికారులు హామీ ఇచ్చారు. విద్యార్థుల భద్రత విషయంలో ఎటువంటి రాజీ పడబోమని అధికారులు స్పష్టం చేశారు.

## నూతన సర్పంచ్‌కి ఘన సన్మానం




**ప్రజాపక్షం/దేవరుప్పుల:** మండలంలోని జెడ్‌పిహెచ్‌ఎస్ మాధాపురం పాఠశాలలో నూతనంగా ఎన్నికైన సర్పంచ్ పంజాల శ్రీధర్‌ని పాఠశాల యాజమాన్యం శుక్రవారం ఘనంగా సన్మానించడం జరిగింది. ఈ సందర్భంగా హెచ్‌ఎం రమేష్ మాట్లాడుతూ పాఠశాల అభివృద్ధిలో గ్రామ ప్రజల భాగస్వామ్యం ఎంతో కీలకమని పేర్కొంటూ అందరికి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ లక్ష్మి, వార్డు సభ్యులు కొమురయ్య, నరేష్, అనిల్, రమ్య, ధనలక్ష్మి, యాకయ్య, యమున, ఎపిపిసి చైర్మన్ వసంత, ఉపాధ్యాయులు మాధవి, శివలింగం, అశోక్, సత్తయ్య, అశోక్ పాల్గొన్నారు.

# పెండిగ్ పనులను వెంటనే ప్రారంభించండి

### అభివృద్ధి పనులపై జిల్లా కలెక్టర్ అధికారులతో సమీక్ష సమావేశం




**ప్రజాపక్షం/హుస్నాబాద్:**హుస్నాబాద్ నియోజకవర్గంలో హుస్నాబాద్ , అక్కన్నపేట, కొహెడ, మూడు మండలాలకు ప్రభుత్వం నుండి మంజూరై న అభివృద్ధి పనులు పెండిగ్‌లో ఉంటే వెంటనే ప్రారంబించాలని , కొత్తపెల్లి నుండి హుస్నాబాద్ వరకు చేపట్టిన నాలుగు వరుసల రహదారి పనుల్లో ఉన్న కంటుపోళ్లు, చెట్లను వెంటనే తోలగించి పనులు మొదలు పెట్టాలని గుత్తెదారులను, ఇంజనీరింగ్ అధికారులను సిద్దిపేట జిల్లా కలెక్టర్ కె హైమవతి అదేశించారు. శుక్రవారం హుస్నాబాద్ మున్సిపల్ కార్యాలయంలో డిఅర్‌డిఒ జయదేవ్‌అర్య, అర్‌డిఒ రాంమూర్తితో కలిసి మూడు మండలాల అధికారులతో సమీక్ష సమావేశం ఏర్పాటు చేశారు. మండలాల్లో చేపడుతున్న అభివృద్ధి పనులపై మండలాల వారిగా అధికారులతో వేరు వేరుగా పనుల పురోగతిపై సమీక్షిoచారు. గ్రామాల్లో చేపడుతున్న జి పి ,అంగన్‌వాడి, సిసి రోడ్డు, హెల్త్‌సెంటర్ రీపెర్, కాంపౌండ్‌వాల్స్,వివిధ రహదారుల నిర్మాణం లో ఉన్న వాటిని నాణ్యత ప్రమాణలతో వెంటనే పూర్తి చేయాలని అదేశించారు. రోడ్డు భవనాల అధికారులు కొత్తపెల్లి నుండి హుస్నాబాద్ వరకు చేపట్టిన నాలుగు వరుసల రహదారి పనుల్లో వెంట అవతరాలను తొలగించేందుకు అధికారుల సమన్వయంతో పనులు చేయాలని కొరారు. మున్స్పిల్ కూడళ్ల అభివృది పనులు , సుందరికరణ, పనులను నిర్ణిత కాలంలో పూర్తి చేయాలని అదేశించారు. జాతీయ రహదారి పనుల్లో పెండిగ్‌లో ఉన్న పనులను వెంటనే పూర్తి చేయాలని అన్నారు.రోడ్డు వెంట ఉన్న విగ్రహలను అయా గ్రామాల సర్పంచులతో కలిసి వాటిని తోలగించి పెండిగ్ పనులను పూర్తి చేయాలని అన్నారు. గౌరవెల్లి లో అర్ అండ్ అర్ కలనిలో మిషన్‌భగీరథ పనులను సకాలంలో పూర్తి చేయాలని అన్నారు. ఆయిల్ ఫాం సాగు గూర్చి రైతులకు వివరించి ఉద్యాణవన అధికారులు వారికి ఇచ్చిన టార్గెట్‌ను పూర్తి చేయాలని కొరారు. ఈ కార్యక్రమంలో అయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

## గ్రామాభివృద్ధికి కలిసికట్టుగా పనిచేద్దాం:సర్పంచ్

**ప్రజాపక్షం/బచ్చన్నపేట:** గ్రామాభివృద్ధికి అందరం కలిసికట్టుగా పనిచేద్దామని బచ్చన్నపేట మేజర్ గ్రామ పంచాయితీ సర్పంచ్ అల్వాల నర్సింగరావు అన్నారు. శుక్రవారం బచ్చన్నపేట గ్రామ పంచాయితీలో ఏర్పాటుచేసిన సమవేశంలో వార్డు మెంబర్లతో కలిసి ఆయన మాట్లాడుతూ గ్రామంలోని 14 వార్డులలో నెలకొన్న సమస్యలు గుర్తించి వాటిని పరిష్కరించ విధంగా కృషి చేద్దామన్నారు. ప్రజలకు నిత్యం తాగునీరు, వీధి దీపాల నిర్వహణ, పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి పెడతామన్నారు. గ్రామాభివృద్ధికి నిరంతరం పాటుపడతామన్నారు.ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ బైరు రజిత, వార్డు సభ్యులు పురాణం శ్రీనివస్, ప్రశాంత్, భవాని, అంజయ్య, రాజు, చంద్రమ్మ, భాస్కర్, మల్లేష ఉమారాణి, విజయలక్ష్మి, మాధవి, స్వప్న, లావణ్య, తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా కొమ్మూరి జన్మదిన వేడుకలు

**ప్రజాపక్షం/జనగామ టౌన్:** నియోజకవర్గ ఇంచార్జి కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. నాయకులు కేక్ కట్ చేసి పేదలకు పండ్లు, బ్రెడ్ పంపిణి చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా అభివృద్ధి, సమన్వయ, పర్యవేక్షణ కమిటీ మెంబర్ బక్క శ్రీనివాస్, ఆకునూరు సర్పంచ్ రవి, పట్టణ నాయకులు రాజుగౌడ్ పాల్గొన్నారు.

## యువత ఉచిత స్కిల్ ట్రైనింగ్‌ను సద్వినియోగం చేసుకోవాలి:కలెక్టర్

**ప్రజాపక్షం/జనగామటౌన్:** జిల్లాలోని నిరుద్యోగ నిరుద్యోగ యువత ఉచిత స్కిల్ ట్రైనింగ్‌ను సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ రిజ్వాన్ భాషా షేక్ అన్నారు. జిల్లా కేంద్రంలోని కలెక్టర్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన డ్రైవ్‌లో కలెక్టర్ పాల్గొని మాట్లాడారు. ఎల్ఎస్‌సీ లాజిస్టిక్స్ స్కిల్ కౌన్సిల్ సహకారంతో యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలని ఈ ఉచిత ట్రైనింగ్‌ను ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. దీని ద్వారా లాజిస్టిక్స్ రంగానికి చెందిన వివిధ విభాగాల్లో నైపుణ్య శిక్షణ అందించి శిక్షణ పూరైన అనంతరం 100శాతం ప్లేస్‌మెంట్‌తో నెలకు 13వేల నుండి 18వేల వరకు జీతంతో ఉద్యోగ అవకాశాలు కల్పించనున్నట్లు తెలిపారు. ఈ డ్రైవ్‌కు 40 మంది అభ్యర్థులు ఎంపికయ్యారని తెలిపారు.ఈ కార్యక్రమంలో డీఆర్‌డీవో వసంత, ఏపీడీ నూరోద్దీన్, మౌనిక, లాజిస్టిక్ కౌన్సిలింగ్ ఆఫ్ ఇండియా అండర్ స్కిల్ ఇండియా ప్రతినిధులు, పాల్గొన్నారు.

## పట్టణంలో వనిత టీ స్టాళ్లను ప్రారంభించిన కలెక్టర్

**ప్రజాపక్షం/జనగామ టౌన్:** మహిళలకు అనువైన ఆర్థిక ఎదుగుదలకు ఇందిరా మహిళా శక్తి పథకం ఎంతగానో దోహదపడుతుందని దీంతో మహిళలు వ్యాపారవేత్తలుగా అభివృద్ధి చెందుతున్నారని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అన్నారు. శుక్రవారం మహిళల ఆర్థిక స్వావలంబన లక్ష్యంగా పట్టణంలోని మున్సిపల్ సబ్ రిజిస్ట్రేషన్ కార్యాలయ ఆవరణలో మెప్మా సౌజన్యంతో ఏర్పాటుచేసిన వనిత టీ స్టాళ్లను కలెక్టర్ ప్రారంభించడం జరిగింది. ఈ కార్యక్రమంలో జేసి పింకేష్ కుమార్, అధికారులు పాల్గొన్నారు.

## ఆడపిల్ల పుడితే 5 వేలు

### ''కొత్త పథకంతో రోల్ మోడల్‌గా మారిన ధూల్మిట్ట సర్పంచ్''



**ప్రజాపక్షం/మద్దూరు/ధూల్మిట్ట:** ప్రభుత్వపథకాలే కాదు, ధూల్మిట్ట మండలకేంద్రంలోని గ్రామపంచాయితీ నూతన సర్పంచ్‌గా ఎన్నికైన గునుకుల లీల జగన్‌మోహన్ రెడ్డి తన స్వంత కర్చులతో గ్రామంలో నూతన పథకాలను ఆవిస్కరిస్తున్నారు. గతంలో పేదింటి ఆడపిల్లకు పుస్తే మట్టేలు బహుకరిస్తు వచ్చిన దంపతులు, ఎన్నికల సమయంలో తమ ఎజాండా అంశంగా చేర్చిన అంశంను, తన ప్రమాణ స్వీకారం చేసిన రోజు నుండి పుట్టిన ప్రతి ఆడపిల్లకు 5 వేల రూపాయల పథకంతో గ్రామంలోని ప్రతి ఆడపిల్లకు చేరే విదంగా పథకాన్ని గురువారం ధూల్మిట్ట గ్రామపంచాయితీ ఆవరణలో ఘనంగా ప్రారంభించారు.ధూల్మిట్ట గ్రామానికి చెందిన సుద్దాల స్వర్ణలత బాబు కూతురు మేఘనకు మొదటి పుట్టినరోజును ఘనంగా నిర్వహించి, 5వేల రూపాయలను ఫిక్స్డ్ డిపాజిట్ చేసి పత్రాలను తల్లి దండ్రులకు ధూల్మిట్ట గ్రామ సర్పంచ్ గునుకుల లీల జగన్ మోహన్‌రెడ్డి అందించారు. 20 సంవత్సరాల తరువాత ఆ ఆడపిల్ల వివాహానికి పుస్తె మట్టేల కోసం తమ కానుకగా అందించినట్లు ఉంటుందని సర్పంచ్ తెలిపారు. ఈసందర్భంగా గ్రామ సర్పంచ్ గునుకుల లీల జగన్‌మోహన్‌రెడ్డి మాట్లాడుతూ ధూల్మిట్ట గ్రామాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి ఆదర్శంగా తీర్చిదిద్దినట్లు పేర్కొన్నారు. అధికారంలోని ప్రభుత్వం సహకారంతో అర్హుల అందరికి సంక్షేమ పథకాలు అందిస్తామని తెలిపారు. ప్రజలకు ఎల్లవేళలా ఆందుబాటులో ఉండి సమస్యలు పరిష్కరించేందుకు కృషిచేస్తామన్నారు. ప్రజలకు కష్టసుఖాల్లో పాలుపంకుంటామని హామీనిచ్చారు. ఈ కార్యక్రమంలో గ్రామ ఉప సర్పంచ్ తుషాలపురం రాజు, మాజీ జడ్పిటీసీ గిరి కొండల్ రెడ్డి, జాలపల్లి సర్పంచ్ చెట్కూరి కమలాకర్ యాదవ్, ధూల్మిట్ట బిపిఎం సుద్దాల నర్సంహులు, ధూల్మిట్ట కాంగ్రెస పార్టీ గ్రామ శాఖ అధ్యక్షులు చెప్యాల అనిల్, తాజా వార్డు సభ్యులు, గ్రామ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## పట్టణంలో పేరుకుపోయిన సమస్యలను పరిష్కరించాలి

**ప్రజాపక్షం/జనగామ టౌన్:** పట్టణంలో పేరుకుపోయిన సమస్యలను పరిష్కరించాలని శుక్రవారంసిపిఎం జనగామ పట్టణ కమిటీ బృందం జిల్లా కార్యాలయంలో కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్‌కు వివిధ డిమాండ్లతో కూడిన వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటి సభ్యులు గోపి, అజారుద్దీన్, పట్టణ కమిటి సభ్యులు లింగం, నాయకులు మహేందర్ పాల్గొన్నారు.

## సోమేశ్వరుడి హుండి ఆదాయం రూ.18,04,055

**ప్రజాపక్షం/పాలకుర్తి:**మండలకేంద్రంలో కొలువైన శ్రీ సోమేశ్వర లక్ష్మీ నర్సింహస్వామి సోమేశ్వరుడి హుండి ఆదాయం రూ.18,04,055 వచ్చిందని ఈవో లక్ష్మీ ప్రసన్న తెలిపారు. శుక్రవారం ఆలయ కళ్యాణ మండపంలో 2025 అక్టోబర్ నుండి 2026 జనవరి 1 వరకు భక్తులు సమర్పించిన 85 రోజుల కానుకలను కొడవటూర్ సిద్దేశ్వరస్వామి దేవాలయ ఈవో వంశీ పర్యవేక్షణలో లెక్కింపు చేపట్టారు.ఇందులో అమెరికా కరెన్సీ నోట్లు 13(88 డాలర్లు) వచ్చినట్లు ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో సూపరిండెంట్ కొత్తపల్లి వెంకటయ్య, ప్రధానార్చకులు దేవగిరి లక్ష్మన్న, ఆలయ సిబ్బంది, పోలీస్, బ్యాంకు సిబ్బంది పాల్గొన్నారు.

# మంచు దుప్పటి కప్పుకున్న మండలాలు



**ప్రజాపక్షం/గూడూరు/కొత్తగూడ;** మహబూబాబాద్ జిల్లా గూడూరు కొత్తగూడ గంగారం మండలాల్లో మంచు దుప్పటి వలె కప్పుకున్నాయి తీవ్రమైన పోగ మంచుతో రహదారిపై వెళ్లే వాహనాలు నడపడం కష్టతరంగా మారింది. సోమవారం మహబూబాబాద్ జిల్లా గూడూరు కొత్తగూడ గంగారం మండలాల్లో ముఖ్యంగా గురువారం శుక్రవారం అధిక శాతం పోగ మంచు కురిసింది.ప్రధానంగా ఏజెన్సీ ప్రాతంగా కాగా ఉక్కువ శాతం రోడ్డు చిన్నవిగా ఉండడం దాంతోపాటు పోగమంచు కారణంగా వాహనాల రవాణాకు తీవ్ర ఇబ్బంది ఎదురైంది మరి ముఖ్యంగా ఎక్కడైనా ఎలాంటి ప్రమాదాలు జరగోచ్చు అనే వాహనదారుల జాగ్రత్తగా వెళ్లారు.అదేవిధంగా ఈపోగా మంచు కారణంగా ముఖ్యంగా అనారోగ్య సమస్యల్లో ఉన్నవారు ఎక్కువగా ప్రమాదానికి గురయ్యే అవకాశం ఉంది. శ్వాస కోస సమస్యలు కంటి సమస్యలు చర్మ సమస్యలు అధికంగా వస్తాయని డాక్టర్లు పలు సూచనలు చేస్తున్నారు.ఈసందర్భంగా అధికారులు ఉదయం కురిసే పోగ మంచు వల్ల పలు జాగ్రత్తలు తీసుకోవాలని ఎవరైనా ఇంట్లో వృద్దులు ఉన్నట్లయితే ఎక్కువసేపు చెద్దర్లు కప్పి వెచ్చగా ఉండేలా చూసుకోవాలని సూచించారు. బయట ప్రయాణాలు చేసేవారు తమ వాoనాలకు లైట్స్ ఇండికేటర్స్ వేసుకొని ప్రయాణాలను ఉదయం పూట చేయకుండా ఉండడం మేలని అన్నారు.

## జర్మనీలో జరిగిన అగ్ని ప్రమాదంలో జనగామ విద్యార్థి మృతి

**ప్రజాపక్షం/జనగామ:**జర్మనీలో జరిగిన అగ్ని ప్రమాదంలో జనగామకు చెందిన విద్యార్థి తోకల హృతిక్‌రెడ్డి మృతి చెందారు. జనగామ జిల్లా చిల్పూర్ మండలం మల్కాపురం గ్రామానికి చెందిన తోకల సంపత్‌రెడ్డి కుమారుడు హృతిక్‌రెడ్డి ఉన్నత చదువుల కోసం జర్మనీ వెళ్లారు. అయితే ఆయన ఉండే ఆపార్ట్‌మెంట్‌లో అగ్రి ప్రమాదం జరిగింది. తప్పించునే క్రమంలో గాయాలయ్యాయి. హాస్పటల్‌లో చికిత్స పొందుతున్న హృతిక్‌రెడ్డి మృతి చెందారు. దీనితో ఆయన సొంతూరు మల్కాపురంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. హృతిక్‌రెడ్డి మృతదేహాన్ని తన సొంతూరుకు తీసుకొచ్చేందుకు అధికారులు ప్రయత్నాలు చేస్తున్నారు. కాగా హృతిక్‌రెడ్డి మృతితో మల్కాపురం కన్నీటి సంద్రమైంది.



## భవన నిర్మాణ పనులను పరిశీలించిన కాంగ్రెస్ నాయకులు

**ప్రజాపక్షం/రామాయంపేట :** ఎస్‌డిఎఫ్ నిధులతో చేపడుతున్న పనులను కాంగ్రెస్ పార్టీ నాయకులు శుక్రవారం పరిశీలించారు. పట్టణంలో 8లక్షల వ్యయంతో నిర్మిస్తున్న రజక సంఘం కమ్యూనిటి భవనాన్ని మాజీ కౌన్సిలర్లు గజవాడ నాగరాజు, దేమె యాదగిరి, పట్టణ అధ్యక్షులు చింతల స్వామిలు పరిశీలించి పనులను నాణ్యతగా చేపట్టాలని సూచించారు. మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్‌రావు సహకారంతో పట్టణ అభివృద్ధి జరుగుతుందన్నారు.

### ఉద్యోగరీత్యా పదవీ విరమణ సహజం

**ప్రజాపక్షం/కొల్చారం :** ఉద్యోగరీత్యా పదవీ విరమణ సర్వ సహజమని తాపస్ మండల అధ్యక్షుడు లక్ష్మీనారాయణ స్పష్టం చేశారు. శుక్రవారం మండల పరిధిలోని ఏటిగడ్డ మందాపూర్ ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడు శ్రీ బాల్ రెడ్డి పదవి విరమణ సందర్భంగా తాపస్ ఉపాధ్యాయ సంగం ఉపాధ్యాయులు బాల్ రెడ్డి ఘనంగా సన్మానిస్తున్న తపస్ (టిపియూఎస్) కొల్చారం మండల అధ్యక్షుడు లక్ష్మీనారాయణ, ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్ మెదక్ జిల్లా తపస్ (టిపియూఎస్) ఉపాధ్యక్షుడు శ్రీధర్ రెడ్డి, కుల్చారం మండల ఎంఈఓ ఉమారాణి మేడమ్, రంగంపేట హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు ఉపేందర్ రెడ్డి, ఏనగండ్ల ప్రధాన ఉపాధ్యాయురాలు అంబికా సోని, రంగంపేట హైస్కూల్ ఉపాధ్యాయుడు నరేష్ చారి పాల్గొనడం జరిగింది. తపస్ కొల్చారం మండల అధ్యక్షుడు లక్ష్మీనారాయణ మాట్లాడుతూ, బాల్ రెడ్డి సార్ స్థిత ప్రజ్ఞులని సమయపాలన పాటించేవారు అని అన్నారు. అతను చేసిన సేవలను గుర్తించి గౌరవించడం జరిగింది అన్నారు.

### గొర్రెల నట్టల నివారణకు టీకాలు

**ప్రజాపక్షం/నిజాంపేట్ :** నిజాంపేట మండల పరిధిలోని రజాక్ పల్లి గ్రామంలో శుక్రవారం గ్రామ సర్పంచ్ వజ్జ కనకరాజు ఆధ్వర్యంలో గొర్రెలు మేకలకు నట్టల మందు టీకాలను పంపిణీ చేశారు. మాట్లాడుతూ గ్రామాలలో గొర్రెలకు మేకలకు నట్టల మందు పంపిణీ చేయడం జరుగుతుందని ఇట్టి మందులను రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో వెటర్నరీ డాక్టర్ మణికుమార్, అసిస్టెంట్ స్వప్న, గ్రామ ఉప సర్పంచ్ రమేష్, ముత్తయ్య, మహంకాళి, గుట్టయ్య, వినోద్, నాగరాజు పాల్గొన్నారు.

## రజాక్ పల్లిలో ఉచిత మెగా వైద్య శిబిరం

**ప్రజాపక్షం/నిజాంపేట్ :** మండల పరిధిలోని రజాక్ పల్లి గ్రామంలో శుక్రవారం కాంగ్రెస్ నాయకుడు లీలా గ్రూప్ చైర్మన్ మీనాక్షి డాక్టర్ మోహన్ నాయక్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిభిరం ఏర్పాటు చేశారు. గ్రామ ప్రజలకు ఉన్నటువంటి ఆరోగ్య సమస్యలను అడిగి తెలుసుకుని వారికి వైద్యపరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులను అందించారు. ఈ సందర్భంగా గ్రామ కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతూ డాక్టర్ మోహన్ నాయక్, ఉచిత మెగా వైద్య శిబిరాలే కాకుండా నిరుపేద కుటుంబాలకు ఆర్థిక సహాయం అందిస్తూ, పేద వధువు వివాహాలకు పుస్తెమట్టెలను అందిస్తూ అండగా నిలుస్తున్న డాక్టర్ మోహన్ నాయక్ కు ఆ భగవంతుని ఆశీస్సులు ఉండాలన్నారు.గ్రామ కార్యదర్శి ప్రశాంత్ గౌడ్, గ్రామ సర్పంచ్ కనకరాజు, కాంగ్రెస్ పార్టీ గ్రామ అధ్యక్షుడు నీలం కనకరాజు, ఫీల్డ్ అసిస్టెంట్ మహంకాళి, రాజు నాయక్, స్వామి, శ్రీకాంత్, నాగయ్య, మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

## నస్కల్ పాలకవర్గం సమావేశం సమస్యల సమీక్ష



**ప్రజాపక్షం/నిజాంపేట్ :** నిజాంపేట మండల పరిధిలోని నస్కల్ గ్రామంలో గ్రామ సర్పంచి నాతి అంజమ్మ అధ్యక్షతన నూతన పాలకవర్గంతో గ్రామసభ సమావేశం నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, గ్రామంలోని తాగునీటి వసతి కల్పించాలని తీర్మానించడం జరిగింది. వీధిలైట్లు, చెడిపోయిన మోటార్లను బాగు చేసి బోరులో బిగించాలని, పాఠశాలలలో మౌలిక వసతులు కల్పించే విధంగా అందరు కృషి చేయాలని, గ్రామంలో ఎప్పటికప్పుడు పరిశుద్ధ్య పనులు సక్రమంగా నిర్వహించాలని, మళ్లీ గ్రామసభ మీటింగ్ వరకు గ్రామంలో మద్యపానం నిషేధం చేయాలని, తైబజార్ కు నూతనంగా ఏర్పాటు చేయాలని, వార్డు సభ్యుల వారీగా గ్రామంలో సమస్యలు పై చర్చించి తీర్మానించడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ దేవరాజ్, కార్యదర్శి మమత, వార్డు సభ్యులు రహీం, శానామాద్, అమృత, రేణుక, మమత, నవీన్, శ్రీకాంత్, సుజాత, కారాబర్ ఎల్లారెడ్డి, లక్ష్మా గౌడ్, అజయ్, నర్సింలు తదితరులు పాల్గొన్నారు.

## గొల్పర్తి గ్రామాన్ని ప్రత్యేక వార్డుగా మార్చండి



**ప్రజాపక్షం/రామాయంపేట :** రామాయంపేట మున్సిపాలిటిలోని గొల్పర్తి గ్రామాన్ని ప్రత్యేక వార్డుగా మార్చాలని తహశీల్దార్ రజనికుమారి, మున్సిపల్ కమీషనర్ దేవందర్‌లకు గ్రామస్థులు వినతిపత్రం అందజేశారు. ఈసందర్బంగా వారు మాట్లాడుతూ గ్రామంలో వెయ్యి మంది ఓటర్లు ఉన్నప్పటికి తమను 7వ వార్డు, 2 వార్డు, కొన్ని ఓట్లు 1వ వార్డులో ఉన్నాయని అన్ని కలిపి తమ గ్రామాన్ని ప్రత్యేక వార్డుగా కేటాయించాలన్నారు. గ్రామంలో అత్యధికంగా 95శాతం ప్రజలు బీసీలు ఉన్నప్పటికి తమ గ్రామానికి గత 20 సంవత్సరాలుగా ఎస్‌సి రిజర్వేషన్ మాత్రమే వస్తుందని కావున ఈసారి బీసీ రిజర్వేషన్ చేయాలని కోరారు. ఈకార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, గ్రామస్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## శేరిలా అంగన్వాడీ కేంద్రంలో సామూహిక సీమంతాలు



**ప్రజాపక్షం/వెల్దుర్తి :** వెల్దుర్తి మండలం చేరిలా గ్రామ పంచాయతీ పరిధిలో ఉన్న అంగన్వాడి కేంద్రాల్లో శుక్రవారం అంగన్వాడి టీచర్లు దేవలత, లక్ష్మి ల ఆధ్వర్యంలో సామూహిక సీమంతాలు అన్నప్రాసనలు, అక్షరాభ్యాసం కార్యక్రమాలను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి గ్రామ సర్పంచి బంజే లావణ్య ఉప సర్పంచ్ బత్తుల నవీన్ పాల్గొని గర్భిణీ బాలింతలకు పలు సూచనలు సలహాలు చేశారు. అంగన్వాడి కేంద్రంలో అందజేసే పాలు గుడ్లు ఆకుకూరల ఒకపూట భోజనం చేసి ఆరోగ్యవంతులుగా ఉండాలని సూచించారు. క్రమం తప్పకుండా ఆరోగ్య సూత్రాలను పాటిస్తూ సబ్ సెంటర్లో అందజేసి ఐరన్ మాత్రమే వేసుకోవాలని సూచించారు. అదనపు ఆహారాన్ని తీసుకొని పండంటి బిడ్డకు జన్మని ఇవ్వాలని సూచించారు. పుట్టిన బిడ్డకు ఆరు నెలల వరకు తల్లిపాలనే తాగించాలన్నారు. ఆరు నెలల అనంతరం అనుబంధాహారాన్ని అందజేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎన్ఎం అనిత, బంజె రాములు, వార్డు సభ్యులు సినింగి లింగం, బండ నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

## నూతన గ్రామపంచాయతీ పాలకవర్గానికి సన్మానం



**ప్రజాపక్షం/నిజాంపేట్ :** మండల పరిధిలోని నార్లాపూర్ గ్రామంలో నూతన సంవత్సరం సందర్భంగా శుక్రవారం కాంగ్రెస్ పార్టీ గ్రామ సర్పంచ్ బత్తుల స్వప్న, ఉప్ప సర్పంచ్ కుమ్మరి రామ చెంద్రం వార్డ్ సభ్యులు కమ్మరి రవి బత్తుల మధు, పాషికంటి శ్రీనివాస్, గాలం నరేష్, ల్యాగల ధర్మ రెడ్డి లను సన్మానించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా విచ్చేసిన మాజీ సర్పంచ్ రావిపల్లీ అమరసెనా రెడ్డి,మాట్లాడుతూ, దేశంలోని కులాలకు మతాలకతీతంగా అందరం కలిసి మెలసి జీవించి అందరి సహకారంతో గ్రామాన్ని అభివృధి దిశలో బాటలు వేయాలన్నారు. ఈ కార్యక్రమంలో పాస్టర్ జ్ఞాన్ రాజ్, బోయిని మహేష్, దుర్గేష్ నాగరాజు, శ్రీనివాస్, వేణు, పాల్గొన్నారు.

## కౌడిపల్లి మండల సర్పంచుల ఫోరం అధ్యక్షుడిగా చంద్రం కృష్ణ గౌడ్

**ప్రజాపక్షం/కౌడిపల్లి :** కౌడిపల్లి మండల సర్పంచుల ఫోరం అధ్యక్షుడిగా కౌడిపల్లి సర్పంచ్ చంద్రం కృష్ణ గౌడ్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. శుక్రవారం కౌడిపల్లి గ్రామ శివారులోని శ్రీ రేణుక ఎల్లమ్మ తల్లి ఆలయ ప్రాంగణంలో నిర్వహించిన మండల సర్పంచుల సమావేశంలో ఈ ఎన్నిక జరిగింది. ఈ సమావేశంలో కాంగ్రెస్ పార్టీకి చెందిన సర్పంచులు మెజారిటీగా మద్దతు ఇవ్వడంతో చంద్రం కృష్ణ గౌడ్ ఏకగ్రీవంగా ఫోరం అధ్యక్షుడిగా నియమితులయ్యారు. అదే సమయంలో మండల సర్పంచుల ఫోరం నూతన కార్యవర్గాన్ని కూడా ఎన్నుకున్నారు. నూతనంగా ఎన్నికైన కార్యవర్గ సభ్యులను పూలమాలలు, శాలువాలతో ఘనంగా సత్కరించారు. కౌడిపల్లి మండల సర్పంచుల ఫోరం నూతన కార్యవర్గం: అధ్యక్షుడు: చంద్రం కృష్ణ గౌడ్ కౌడిపల్లి ఉపాధ్యక్షులు: బోయిని వీరయ్య సదాశివపల్లి మాలోత్ రమేష్ నాయక్ మర్రిచెట్టు తండా ప్రధాన కార్యదర్శి: గొల్ల శేకులు బూర్గుగడ్డ కోశాధికారి: సాలె పద్మ వెంకటేశం ముట్రాజ్ పల్లి సంయుక్త కార్యదర్శి: కోడూరి రాములు కన్నారం ప్రచార కార్యదర్శి: ధరావత్ రాజు నాయక్ కుషన్ గడ్డ తండా కార్యవర్గ సభ్యులు: లక్ష్మీ కుమార్ (వెంకటాపూర్ ఆర్), మూడ్ ధన్ సింగ్ (కొత్త చెరువు తండా), బాంచా దుర్గమ్మ నాగభూషణం (రాజీపే), కుర్మా స్వప్న శేకులు (రైలాపూర్), కాట్రోథ్ శోభా హరి సింగ్ (జాజితాం), కేతావత్ శ్యామిలి పరములాల్ (లింగంపల్లి తండా). ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు చంద్రం దుర్గా గౌడ్, పుండరీకం గౌడ్, ఓం ప్రకాష్, కౌడా శ్రీనివాస్ గుప్త, వెంకటేశం గుప్తా, మల్లికార్జున్ గౌడ్, సత్యనారాయణ గౌడ్, రాగుల భూమయ్య పటేల్, కుర్మా లక్ష్మణ్, ఉపసర్పంచ్ మంగళపర్తి శ్రీకాంత్, అలాగే వెంకటేశ్వర రావు, పాం శేఖర్, మల్లేశం, ఎగేల్లి నాగరాజు, రమేష్, బచ్చలి నాగరాజు, మంగళి అశోక్ నాయి, వీరేశ్ గౌడ్, వంజరి శ్రీకాంత్, సుధాకర్, సురేష్, పోచయ్య, శంకర్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.



## మాజీ వార్డు సభ్యురాలిని పరమార్శించిన ఎమ్మెల్యే నందమూరి బాలక్రిష్ణ

**ప్రజాపక్షం/రామాయంపేట :** క్యాన్సర్‌తో బాధపడుతూ బసవతారకం ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రామాయంపేట పంచాయతి మాజీ వార్డు సభ్యురాలు, బలగం ఫేం నారాయణ (మురలీదర్‌గౌడ్) సతీమణి ఐరేని శశికళను టిడిపి ఎమ్మెల్యే, సినీహీరో నందమూరి బాలక్రిష్ణ శుక్రవారం ఆసుపత్రిలో పరామర్శించారు. శశికళ గత కొద్దిరోజులుగా క్యాన్సర్ వ్యాధితో బాధపడుతుంది. హైద్రాబాద్‌లోని బసవతారకం ఇండో అమెరికన్ హాస్పటల్‌లో చేర్పించగా బాలక్రిష్ణ బాధితురాలిని కలిసి పరామర్శించి భరోసా కల్పించారు.

## క్యాలెండర్ ఆవిష్కరించిన ఎంఇఒ

**ప్రజాపక్షం/నిజాంపేట్ :** ఎస్‌జిటియూ నూతన సంవత్సర క్యాలెండర్ ను నిజాంపేట మండల విద్యాధికారి సాంగని యాదగిరి చేతుల మీదుగా నిజాంపేట ప్రాథమిక పాఠశాలలో ఆవిష్కరించడం జరిగింది. ఎస్‌జిటియు మండల అధ్యక్షులు పర్శరాములు, ప్రధాన కార్యదర్శి దశరథం తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ఎస్‌జిటి ఉపాధ్యాయుల సమస్యల పైన పోరాడడానికి తమ సంఘం నిరంతరం కృషి చేస్తుంది అని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి జగన్ మోహన్, జిల్లా మహిళా ప్రధాన కార్యదర్శి స్వప్న, మండల మహిళా అధ్యక్షురాలు సాగరిక, మహిళా కార్యదర్శులు దివ్య, లావణ్య, లక్ష్మీ, మండల కార్యదర్శులు శ్రీనివాస్, రాజేందర్, శ్రీకాంత్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



## దారి ఇలా రాకపోకలు ఎలా?

### ప్రమాదాలు జరిగితే కానీ పట్టించుకోరా

**ప్రజాపక్షం/రేగోడ్ :** మండల కేంద్రంలోని వాహనాదాలకు సౌకర్యం రెండు వరసల రహదారి నిర్మాణం చేపట్టారు రేగోడ్ మర్పల్లి గ్రామాల మధ్య వంతెన నిర్మాణం చేయల్సి ఉంది రెండు వైపులా రహదారి విస్తరణ చేసినప్పటికీ మధ్యలో వంతెన నిర్మాణం చేయకుండా అసంపూర్తిగా వదిలేశారు ప్రభుత్వాలు మారిన ఫలితం లేదు అని ప్రజలు అవేదన వ్యక్తం చేస్తున్నారు దీంతో ప్రమాదాలు జరుగుతున్నాయిని వాహనా దారులు ఆందోళన చెందుతున్నారు ఏళ్ల తరబడి నిర్లక్ష్యంగా వదిలేయడంతో సంబంధిత అధికారులు తీరు పై ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు అధికారులు ఇప్పటికైనా స్పందించి అసంపూర్తి రహదారి, వంతెన నిర్మాణాన్ని పనులు పూర్తిచేసి సమస్య పరిష్కరించాలని వాహన దారులు ప్రజలు కోరుతున్నారు

## శ్రీ తిరుమల స్వామి ఆలయ హుండీ లెక్కింపు

**ప్రజాపక్షం/నిజాంపేట్ :** నిజాంపేట మండల పరిధిలోని చల్మెడ శ్రీ తిరుమల స్వామి ఆలయంలో శుక్రవారం రెవిన్యూ, పోలీస్ అధికారులు దేవదాయ శాఖ ఇన్స్పెక్టర్ రంగారావు, జిల్లా జిపిఓ స్వప్న, ఆలయఈవో రవికుమార్, ఆలయ కమిటీ పాలకవర్గం ఆధ్వర్యంలో ఆలయ హుండీ లెక్కింపు కార్యక్రమం చేపట్టారు. ఈ హుండీ లెక్కింపులో 1,35,866 నగదు వచ్చాయని ఈవో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తిరుమల స్వామి ఆలయంలో వచ్చినటువంటి ఇట్టి ఆదాయాన్ని బ్యాంకులో జమ చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ అక్కపల్లి రాంరెడ్డి, పూజారి రామ్మోహన్ శర్మ, గ్రామ సర్పంచ్ బొమ్మన మల్లేశం, ఉప సర్పంచ్ ఆకుల మహేందర్, డైరెక్టర్ బాజా రమేష్, ఎల్లా గౌడ్, కాకి రాజయ్య, సంగేపునారాయణ, శ్యామ్, కానిస్టేబుల్ విజయ్, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## ఈకెవైసి చేయకపోతే రేషన్ కట్
### పౌరసరఫరాల శాఖ హెచ్చరిక

ప్రజాపక్షం/మనోహరాబాద్ : తెలంగాణ రాష్ట్రంలోని రేషన్ కార్డుదారులకు పౌరసరఫరాల శాఖ కీలక హెచ్చరిక జారీ చేసింది. రేషన్ కార్డులో పేరు నమోదై ఉన్న ప్రతి ఒక్క సభ్యుడు తప్పనిసరిగా ఈకెవైసి ప్రక్రియను పూర్తి చేయాలని స్పష్టం చేసింది. ప్రస్తుతం మెదక్ జిల్లాలో మొత్తం రేషన్ కార్డుదారుల్లో కొంతమంది మాత్రమే ఈ కెవైసి పూర్తి చేయగా,మిగిలిన కార్డుదారులు ఇంకా ఈ ప్రక్రియ పూర్తి చేయాల్సి ఉంది. పూర్తికాని పక్షంలో భవిష్యత్తులో రేషన్ సరుకుల పంపిణీలో ఇబ్బందులు ఎదురయ్యే అవకాశం ఉందని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో అన్ని ఫెయిర్ ప్రైస్ షాప్ (ఎఫ్‌పిఎస్) డీలర్లు తమ షాపుల వద్ద ఫ్లెక్సీలు/నోటీస్ బోర్డులు ఏర్పాటు చేసి, రేషన్ కార్డుదారులకు ఈ కెవైసి ప్రాధాన్యతపై అవగాహన కల్పించాలని ఆదేశించారు. అలాగే ప్రతి కార్డుదారుడి e KYC పూర్తయ్యేలా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని సూచించారు.

## క్రీడాకారులకు క్రీడా దుస్తులు పంపిణీ

ప్రజాపక్షం/మహాదేవపూర్ : మండలకేంద్రంలో నిర్వహించే ప్రీమియర్ లీగ్ క్రికెట్ టోర్నమెంట్‌లో పాల్గొనే ఎకె 11టీ క్రీడాకారులకు శుక్రవారం సర్పంచ్ హసీనా బానో అక్బర్ ఖాన్ ఆధ్వర్యంలో క్రీడా దుస్తులు ''టీ షర్ట్‌లు''పంపిణీ చేసారు.

**కుదురుపల్లి సర్పంచ్ ఆధ్వర్యంలో :** కుదురుపల్లి సర్పంచ్ చల్ల సమ్మి రెడ్డి ఆధ్వర్యంలో ప్రీమియర్ లీగ్ క్రికెట్ పోటీల్లో పాల్గొనే రాయల్ వారియర్స్ టీం క్రీడాకారులకు టీ షర్ట్‌లు పంపిణీ చేశారు.

**బిజెపి అధ్యక్షుని ఆధ్వర్యంలో :** బిజెపి మండల అధ్యక్షుడు రాంపెల్లి మనోజ్ ఆధ్వర్యంలో ప్రీమియర్ లీగ్ క్రికెట్ పోటీల్లో పాల్గొనే జై హింద్ క్రికెట్ టీం సభ్యులకు టీ షర్ట్‌లు పంపిణీ చేశారు. కాంగ్రెస్‌పార్టీ మండల అధ్యక్షుడు అక్బర్ ఖాన్,కుదురుపల్లి సర్పంచ్ చల్ల సమ్మిరెడ్డి, బిజెపి అధ్యక్షుడు రాంపెల్లి మనోజ్ మాట్లాడుతూ క్రీడలు శారీరక మానసిక ఉల్లాసానికి దోహదపడతాయని అన్నారు. వార్డు సభ్యులు గడ్డం స్వామి, బిజెపి నాయకులు,ఆకుల శ్రీధర్, ఐలయ్య యాదవ్ క్రీడాకారులు పాల్గొన్నారు.

## శబ్దం నుంచి నిశ్శబ్దం వరకు.. విన్నూత కార్యశాలకు వేదిక కానున్న గీతం స్కూల్ ఆఫ్ ఫార్మసీ

ప్రజాపక్షం/పటాన్‌చెరు : గీతం స్కూల్ ఆఫ్ ఫార్మసీ విద్యార్థులను పరిశ్రమ అవసరాలకు అనుగుణంగా సంసిద్ధం చేసే లక్ష్యంతో శబ్దం నుంచి నిశ్శబ్దం వరకు విజయం నుంచి ఆత్మపరిశీలన వైపు ఒక ప్రయాణం పేరిట ఈనెల 9న శుక్రవారం ఒక రోజు కార్యశాలను నిర్వహించనున్నారు. ఈ విషయాన్ని కార్యశాల సమన్వయ కర్త డాక్టర్ శ్రీకాంత్ గబాడి శుక్రవారం విడుదల చేసిన ఒక ప్రకటనలో వెల్లడించారు. ప్రిన్స్‌టన్ క్రోమాటోగ్రఫీ ఇంక్ స్వాస్త హబ్‌లతో కలిసి నిర్వహిస్తున్న ఈ కార్యశాలలో టారో హీలర్ సంఖ్యాశాస్త్ర నిపుణురాలు జీవిత లక్ష్యం ,మనస్తత్వ కోచ్ ఎనర్జీ వెల్నెస్ మెంటార్ లిప్పి జిల్లాతో పాటు ప్రిన్స్‌టన్ క్రోమాటోగ్రఫీ ఇంక్ ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ నవీన్ కుమార్ కొట్టక్కి ప్రధాన వక్తలుగా పాల్గొంటారని తెలియజేశారు. ఫార్మ (ఫార్మసి ప్రేమ్‌వర్కును సాధన సంపూర్ణ ఆరోగ్యం చర్య పునరావృత సాధన శ్వాస మీద ధ్యాస లక్ష్యానికి అనుగుణంగా పనిచేయడం వంటివన్నీ విరిస్తారని డాక్టర్ శ్రీకాంత్ తెలిపారు.

# రహదారి భద్రతకు ప్రజల భాగస్వామ్యం అవసరం

### జిల్లా కలెక్టర్ ప్రావీణ్య



ప్రజాపక్షం /సంగారెడ్డి : రహదారి భద్రత ప్రతి ఒక్కరి బాధ్యత అని జిల్లా కలెక్టర్ పి.ప్రావీణ్య అన్నారు. జాతీయ రహదారి భద్రత మాసోత్సవం సందర్భంగా కలెక్టర్ చాంబర్‌లో జాతీయ రహదారి భద్రత మాసోత్సవానికి సంబందించిన పోస్టర్లు ,బ్యానర్లు పాంప్లెంట్స్ కలెక్టర్ విడుదల చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రహదారి ప్రమాదాలను తగ్గించి ప్రజల్లో రోడ్డు భద్రతపై అవగాహన పెంపొందించేందుకు జాతీయ రహదారి భద్రతా మాసోత్సవంలో పలు కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రహదారి భద్రతపై ప్రతి ఒక్కరూ బాధ్యతయుతంగా వ్యవహరించాలన్నారు. రహదారి భద్రతకు సంబంధించిన సందేశాలను ప్రజలలోకి విస్తృతంగా తీసుకెళ్లాలని రవాణా శాఖ అధికారులకు సూచించారు. అనంతరం రవాణా శాఖ ఆధ్వర్యంలో కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన కార్యక్రమంలో విద్యార్థులు, అధికారులు ఉద్యోగులతో రోడ్డు భద్రత ప్రతిజ్ఞ చేయించారు. ట్రాఫిక్ నిబంధనలు పాటించడం ,హెల్మెట్, సీట్‌బెల్ట్ వినియోగం మద్యం సేవించి వాహనాలు నడపకూడదనే అంశాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో జిల్లా రవాణా శాఖ అధికారి అరుణ, జడ్పీసీఈఓ జానకి రెడ్డి సంక్షేమ శాఖల అధికారులు వివిధ శాఖల అధికారులు ,ఉద్యోగులు, జిల్లా రవాణా శాఖ కార్యాలయ సిబ్బంది విద్యార్థులు పాల్గొన్నారు. రవాణా శాఖ జిల్లా కార్యాలయంలో డిప్యూటీ కమిషనర్ వెంకటరమణ, డిటిఒ అరుణ, కార్యాలయ ఉద్యోగులు సిబ్బందితో కలిసి రహదారి భద్రతా ప్రతిజ్ఞను చేసారు.

## ముసాయిదా ఓటర్ల జాబితా విడుదల 5వ తేది తుది గడువు

### -మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్‌రెడ్డి

ప్రజాపక్షం/సంగారెడ్డి : మున్సిపల్ ఎన్నికల సన్నద్ధతలో భాగంగా సంగారెడ్డి మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ కమీషనర్ శ్రీనివాస్‌రెడ్డి పట్టణ పరిధిలో 38 వార్డులకు సంబంధించిన డ్రాఫ్ట్ ఎలక్ట్రోరల్ రోల్స్ జాబితాను మున్సిపల్ సిబ్బందితో కలిసి విడుదల చేశారు.

ఇట్టి జాబితాను మున్సిపల్ కార్యాలయంలోనూ సంబంధిత పోలింగ్ కేంద్రాల నోటీస్ బోర్డులపై అందుబాటులో ఉంచినట్లు తెలిపారు. సంగారెడ్డి మున్సిపాలిటీ పరిధిలోని సాధారణ ప్రజలు నమోదైన ఓటర్లు తమ పేర్లు, చిరునామాలు, తదితర వివరాలను ఓటరు జాబితాలో పరిశీలించుకుని ఏవైన అభ్యంతరాలు క్లెయిమ్స్ ,సూచనలు ఉన్నట్లయితే ఈనెల 5వ తేది లోపు తమ ఫిర్యాదులను సంగారెడ్డి మున్సిపల్ కార్యాలయంలో సమర్పించాలని సూచించారు. నిబంధనల ప్రకారం నిర్దేశించిన గడువు లోపు దాఖలు చేయాల్సిందిగా కమిషనర్ కోరారు. ఓటర్ల తుది జాబితా ఈ నెల 10వ తేదిన ప్రకటించనున్నట్లు ఆయన పేర్కొన్నారు.

## ఎస్పిబి వలలో ఎస్ఐ రమేష్

ప్రజాపక్షం/సంగారెడ్డి : రోజు రోజుకు అవినీతి పెరిగిపోయింది. ఇటీవల పిడీఎస్ బియ్యం లారీ పట్టుబడితే ఆ కేసు నుంచి తప్పించేందుకు ఎస్సై రూ.20 వేలు లంచం డిమాండ్ చేశారు. దీంతో ఇవాళ ఆ ఎస్ఐ లంచం తీసుకుంటూ ఏసిబి చిక్కాడు ఈ ఘటన సైబరాబాద్ కమిషనరేట్ పరిధిలోని కొల్లూరు పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఏసీబీ అధికారులు వెల్లడించిన వివరాల ప్రకారం కొల్లూరు పోలీస్ స్టేషన్ లో సబ్ ఇన్స్‌పెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్న రమేష్ అవినీతి నిరోధక శాఖ అధికారులకు పట్టుబడ్డారు. కొల్లూరు పోలీస్ స్టేషన్ పరిధిలో అక్టోబర్ 17,2025 న పిడిఎస్ బియ్యాన్ని తరలిస్తున్న లారీ ని కొల్లూరు పోలీసులు పట్టుకొని కేస్ నమోదు చేశారు.

ఈ కేసులో లారీ తప్పించేందుకు ఎస్. ఐ రమేష్ లారీ యజమానికి రూ.20వేలు లంచం డిమాండ్ చేశారు. దీంతోలారీ యజమానిఏసిబీ ని ఆశ్రయించారు. ఏసిబీ అధికారుల సూచనల మేరకు శుక్రవారం లారీ ఓనర్ కొల్లూరు పోలీస్ స్టేషన్ లో రూ. 20 వేల లంచం ఇస్తుండగా రెడ్ హ్యాండెడ్‌గా పట్టుబడ్డారు. ఇప్పటికే అనేక ఆరోపణలతో ఎస్ఐ రమేష్, బదిలీ లిస్టు లో ఉన్నట్లు తెలుస్తోంది. తాజాగా లంచం డిమాండ్ చేసి ఏసిబీ కి చిక్కడంతో డిపార్ట్మెంట్ లో తీవ్ర చర్చకు దారి తీసింది. రమేష్ కు సంబంధించిన ఆస్తుల వివరాలపై ఏసిబీ అదికారులు ఆరా తీస్తున్నట్లుసమాచారం.

## సంగారెడ్డి జిల్లా ప్రజలకు నూతన సంవత్సర శుభాకాంక్షలు

### జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్

ప్రజాపక్షం/సంగారెడ్డి : సంగారెడ్డి జిల్లా పోలీసు కార్యాలయంలో నూతన సంవత్సర వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ పరితోష్ పంకజ్ సిబ్బందిత కలిసి కేక్ కట్ చేసి గడిచిన సంవత్సరానికి వీడ్కోలు చెపుతూ నూతన ఆశయాలతో కొత్త సంవత్సరానికి ఆహ్వానం పలకాలని ఆకాంక్షిస్తూ సంగారెడ్డి జిల్లా ప్రజలకు సిబ్బందికి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. జిల్లా యంత్రాంగం అంతా కట్టుదిట్టమైన భద్రత పరమైన చర్యలు తీసుకోవడం జరిగిందని జిల్లా ఎస్పీ వివరించారు.

## టిఎస్‌యుటిఎఫ్ డైరీ ఆవిష్కరణ
### రాష్ట్ర కార్యదర్శి గొప్ప సమ్మారావు

ప్రజాపక్షం/మంగపేట : మండలంలో టిఎస్ యుటిఎఫ్ 2026 డైరీ క్యాలెండర్ అధ్యాపకదర్శిని మండల విద్యాశాఖ అధికారిని పాదెం మేనక చేతుల మీదుగా ఆవిష్కరణ చేయగా ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఉపాధ్యాయులు రాష్ట్ర కార్యదర్శి గొప్ప సమ్మరావు మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం ఉపాధ్యాయుల పెండింగ్ డిఏ పిఆర్‌సి వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

ములుకాల వెంకటస్వామి, కొండ చెంచయ్య, మండల బాధ్యులు గుండం పురుషోత్తం, మండల అధ్యక్షులు మాలోత్ రాజు, మండల ప్రధాన కార్యదర్శి, కొమరం శ్రీనివాస్, చింత లక్ష్మీ నారాయణ, ప్రశాంత్, ప్రేమ్ కుమార్, క్రాంతి కుమార్, ఉమ పాల్గొన్నారు.

## రహదారి భద్రతే లక్ష్యం

ప్రజాపక్షం/సంగారెడ్డి : రహదారి భద్రత మాసోత్సవంలో భాగంగా రెండవ రోజైన శుక్రవారం జిల్లా వ్యాప్తంగా రవాణా శాఖ ఆధ్వర్యంలో విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. జిల్లాలోని వివిధ మండలాలలో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు రహదారి భద్రత ప్రతిజ్ఞ చేయించడంతో పాటు రహదారి నిబంధనలు ట్రాఫిక్ చట్టాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సీట్ బెల్ట్ తప్పనిసరిగా వినియోగించడం హెల్మెట్ ధరించడం ,మద్యం సేవించి వాహనాలు నడపకూడదని, అధిక వేగంతో వాహనాలు నడపరాదని వాహనం నడుపుతూ మొబైల్ వినియోగం చేయరాదని వంటి ముఖ్య అంశాలపై విద్యార్థులకు వివరించారు. వట్టిపల్లి మండలం మర్వెల్లి జిల్లా పరిషత్ హైస్కూల్ నిర్విష్ట ప్రాథమిక పాఠశాలలో ఎంఎవిఐలు గౌతమ్‌రాజ్ వెంకటేశులు విద్యార్థులు ఉపాధ్యాయులు రహదారి భద్రతపై అవగాహన కల్పించారు.

## మున్సిపల్ ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పనిచేయాలి

### మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి

ప్రజాపక్షం/భూపాలపల్లి : మున్సిపల్ ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా కార్యకర్తలు, నాయకులు పనిచేయాలని భూపాలపల్లి మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణ రెడ్డి కార్యకర్తలకు, నాయకులకు పిలుపునిచ్చారు. భూపాలపల్లి మున్సిపాలిటీ పరిధిలోని 14వ వార్డు జంగేడు ప్రాంతంలో పట్టణ బిఆర్‌ఎస్ పార్టీ అధ్యక్షుడు కటకం జనార్ధన్ అధ్యక్షతన నిర్వహించిన బస్తీ బాట కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకట రమణా రెడ్డి, వరంగల్ జిల్లా జడ్పీ మాజీ చైర్‌పర్సన్ భూపాలపల్లి జిల్లా బిఆర్‌ఎస్ పార్టీ అధ్యక్షురాలు గండ్ర జ్యోతి ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, భూపాలపల్లి మున్సిపల్‌లో ఉన్న తాగునీరు, డ్రైనేజీ, రోడ్లు, పారిశుద్యం సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ సెగ్గం వెంకటరాణి సిద్ధు, మాజీ వైస్ చైర్మన్ గండ్ర హరీష్ రెడ్డి, గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ బుర్ర రమేష్ గౌడ్, స్థానిక నాయకులు, పార్టీ కార్యకర్తలు, వార్డు ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## అర్ధరహిత మాటలు సరికాదు

### రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ డైరెక్టర్ గుమ్మడి సోమయ్య

ప్రజాపక్షం/మంగపేట : శుక్రవారం రోజున కొన్ని ప్రింట్ మీడియా వేదికలలో ములుగు బిఆర్‌ఎస్ పార్టీ నియోజకవర్గం ఇంచార్జి బడే నాగ జ్యోతి మాట్లాడిన మాటలు ఆమె విజ్ఞతకే వదిలేస్తున్నాం అని రాష్ట్ర పంచాయతీ రాజ్ శాఖ డైరెక్టర్ గుమ్మడి సోమయ్య అన్నారు. శుక్రవారం మీడియా సమావేశంలో మాట్లాడుతూ, ప్రపంచంలోనే అతి పెద్ద గిరిజన జాతర తెలంగాణ కుంభమేళ గా ప్రసిద్ధి గాంచిన మేడారం సమ్మక్క సారక్క జాతర ను చరిత్రలో నిలిచిపోయే విధంగా ప్రజా ప్రభుత్వం 220 కోట్ల రూపాయలతో అత్యాధునిక టెక్నాలజీతో జాతర పనులను రాష్ట్ర మంత్రి సీతక్క పర్యవేక్షణలో ఎక్కడ కుడా అవినీతి తావు లేకుండా జిల్లా అధికార యంత్రాంగం తో నిత్యం పర్యవేక్షణ చేస్తూ అధికారులతో సమన్వయము చేస్తూ పనులను చేపిస్తుంటే, కొందరు నాయకులు అభివృద్ధి నీ చూసి ఓర్వలేక అర్ధరహితంగా మాట్లాడటం బాధాకరం, మీ ప్రభుత్వంలో కమిషన్‌ల కోసం కక్కుర్తి పడి వ్యవస్థను నాశనం చేశారు అన్నారు.

## బెదిరింపులకు పాల్పడిన వ్యక్తిపై కేసు నమోదు : సిఐ నరేష్ కుమార్

ప్రజాపక్షం/భూపాలపల్లి : భూపాలపల్లి పట్టణంలోని ఎస్.సి. మహిళా హాస్టల్‌లో ఇటీవల జరిగిన సంఘటనను ఆసరాగా తీసుకొని, తాను తెలంగాణ సెక్రటేరియట్‌కు చెందిన ఐటీ శాఖ జాయింట్ సెక్రటరీనని నటిస్తూ, వివిధ జిల్లాలకు చెందిన ప్రభుత్వ అధికారులకు ఫోన్ చేసి వివరాలు అడగడం, ఆదేశాలు ఇవ్వడం, సరిగా పనిచేయకపోతే చర్యలు తీసుకుంటామని బెదిరించడం వంటి చర్యలకు పాల్పడిన హైదరాబాద్ నివాసి రాజేంద్ర ప్రసాద్‌పై సీలం శ్రీనివాస్‌రావు, జిల్లా పబ్లిక్ రిలేషన్స్ ఆఫీసర్ ఇచ్చిన దరఖాస్తు మేరకు భూపాలపల్లి పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేయబడిందని భూపాలపల్లి సిఐ నరేష్ కుమార్ తెలిపారు. ఈ కేసులో దర్యాప్తు చేపట్టి నిందితుడైన రాజేంద్ర ప్రసాదును అరెస్ట్ చేసి, న్యాయస్థానంలో హాజరు పరచడం జరిగింది. ప్రభుత్వ ఉన్నతాధికారులుగా నటిస్తూ ప్రజలను మరియు అధికారులను భయభ్రాంతులకు గురిచేసి మోసాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని, ఇటువంటి ఘటనలపై వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని భూపాలపల్లి ఇన్స్పెక్టర్ డి.నరేష్ కుమార్ తెలిపారు.

## భూగర్భ జలాల పరిరక్షణకు ఇంకుడు గుంతలే మార్గం

ప్రజాపక్షం/ఏటూరునాగారం : ఏటూరునాగారం మేజర్ గ్రామపంచాయతీ కార్యాలయ ఆవరణలో శుక్రవారం సర్పంచ్ కాకుల మర్రి శ్రీలత నూతనంగా నిర్మించిన ఇంకుడు గుంతను ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ శ్రీలత మాట్లాడుతూ రోజురోజుకూ పడిపోతున్న భూగర్భ జలమట్టాలను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. ముఖ్యంగా వేసవి కాలంలో నీటి ఎద్దడి కలగకుండా ఉండాలంటే వర్షపు నీటిని, వృధాగా పోయే నీటిని భూమిలోకి మళ్లించాలని సూచించారు. ప్రతి వార్డులో వార్డు సభ్యులు ప్రజలను చైతన్యపరిచి, ఇంటింటికీ ఇంకుడు గుంతలు ఉండేలా చూడాలని కోరారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి ఉప సర్పంచ్ వార్డు సభ్యులు పంచాయతీ సిబ్బంది గ్రామస్తులు పాల్గొన్నారు.

## సావిత్రి బాయి పూలే ఆశయాలను కొనసాగించాలి

### ఎంఇఒ కొయ్యడ మల్లయ్య

ప్రజాపక్షం/ఏటూరునాగారం : ప్రతి మహిళా ఉపాధ్యాయురాలు సావిత్రి బాయి పూలే ఆశయాలను కొనసాగించాలని ఏటూరునాగారం మండల విద్యాశాఖ అధికారి కొయ్యడ మల్లయ్య అన్నారు. జనవరి 3 సావిత్రి బాయి పూలే జయంతి మహిళా ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా శుక్రవారం తెలంగాణ ప్రోగ్రెస్సివ్ టీచర్స్ ఫెడరేషన్ ఏటూరునాగారం మండల కమిటీ ఆధ్వర్యంలో మండల కేంద్రంలో ఉన్న కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలలో (కేజీబీవీ) మహిళా ఉపాధ్యాయులకు సన్మాన కార్యక్రమం ఏర్పాటు చేశారు.